ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
ఆదివారం 3 మార్చి 2024

పెనుకొండకు రా.. కదలిరా..

చంద్రబాబు సభకు భారీ ఏర్పాట్లు
పోటెత్తనున్న జనం



పుట్టపర్తి, మార్చి2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పార్లమెంటు నియోజకవర్గాల్లో వైసీపీ ప్రభుత్వ పీడితవర్గాలను ఏకం చేసే లక్ష్యంతో నిర్వహిస్తున్న రా.. కదలిరా సభ పెనుకొండ నియోజకవర్గంలో ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. కియ కార్ల పరిశ్రమ వద్ద సోమవారం సభ నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించి ఎర్రమంచి గ్రామ పరిధి జాతీయ రహదారి పక్కన కియ కార్ల పరిశ్రమ ఎదురుగా 25 ఎకరాల్లో సభ ఏర్పాట్లు చేపట్టారు. లక్షమందికిపైగా జనం తరలివస్తారన్న అంచనాతో ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించనున్న సభలో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు పాల్గొననున్నారు. ఈ సభ ద్వారా ప్రభుత్వ వైఫల్యాలతోపాటు వైసీపీ అరాచకపాలనను ప్రజల్లోకి తీసుకెళ్లేలా టీడీపీ శ్రేణులకు అధినేత చంద్రబాబునాయుడు దిశానిర్దేశం చేయనున్నారు. టీడీపీ పాలనలో ఉమ్మడి జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులను పరుగులు పెట్టించి అంతర్జాతీయ కియ కార్ల పరిశ్రమను తీసుకొచ్చారు. ఉమ్మడి జిల్లాను ఆటోమొబైల్ హబ్‌గా తీర్చిదిద్దారు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో చేపట్టిన అభివృద్ధిని ప్రస్తావిస్తూ.. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఒక్క పరిశ్రమ తీసుకొచ్చింది లేదు. నీటి ప్రాజెక్టుల విధ్వంసంతోపాటు జిల్లాలో వైసీపీ సాగించిన అరాచకాలను ప్రధానంగా ప్రస్తావించనున్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే జిల్లాలో ఏం అభివృద్ధి చేస్తామో స్పష్టం చేడంతోపాటు ప్రజలకు అండగా ఉంటానని భరోసా ఇవ్వనున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రకటనలకు ముందు నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభ కావడంతో జిల్లాలో టీడీపీ నేతలు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా జనసమీకరణ చేస్తున్నారు. ఈ సభతో జిల్లాలో అన్ని నియోజకవర్గాలతోపాటు పార్లమెంటు స్థానాన్ని కైవసం చేసుకుని, పార్టీకి పూర్వ వైభవం తీసుకొస్తామనీ, అందుకు పెనుకొండ సభ ద్వారా నాంది పలుకుతామని టీడీపీ నేతలు ప్రకటించారు. టీడీపీ-జనసేన పొత్తు ఖరారై, సీట్ల ప్రకటన తరువాత జిల్లాలో నిర్వహిస్తున్న తొలి బహిరంగ సభ కావడంతో ఇరు పార్టీల నేతలు, శ్రేణులు హాజరుకానున్నారు. ఇప్పటికే టీడీపీ ఇంటింటా తిరిగి సూపర్ సిక్స్ పథకాలను ప్రచారం చేస్తోంది. పెనుకొండలో నిర్వహిస్తున్న రా.. కదలిరా.. సభ 25వది కావడంతో విజయవంతం చేయడానికి టీడీపీ-జనసేన జిల్లా నేతలు సిద్ధమయ్యారు. జిల్లాలో అన్ని దారులు పెనుకొండవైపే అన్న చందంగా ఇరు పార్టీల శ్రేణులతోపాటు రైతులు, కార్మికులు, యవత, మహిళలు సమాయత్తం అవుతున్నారు.



హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న సవిత, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి రవీంద్ర

ముమ్మర ఏర్పాట్లు

హెలీప్యాడ్ పనుల పరిశీలన

పెనుకొండ రూరల్: మండలంలోని కియ కార్ల పరిశ్రమ వద్ద ఈనెల 4వ తేదీన టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో తలపెట్టిన రా.. కదిలిరా.. సభ ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. టీడీపీ పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, పార్టీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి రవీంద్ర, టీడీపీ శ్రేణులతో కలిసి బహిరంగ సభావేదిక, హెలీప్యాడ్‌ను పరిశీలించారు. సభాస్థలం కోసం ఎక్స్‌కవేటర్‌తో భూమి చదును పనులు శరవేగంగా చేపట్టారు. అనంతరం సవిత మాట్లాడుతూ.. కరువు జిల్లా అనంతను ఆదుకోవాలనే ఉద్దేశంతో హెచ్ఎన్ఎస్ఎస్ పథకం కింద గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మించి, అంతర్జాతీయ కియ కార్ల పరిశ్రమ ఏర్పాటు చేయించిన విజన్ ఉన్న నాయకుడు నారా చంద్రబాబునాయుడు అని కొనియాడారు. పరిశ్రమ నిర్మాణంతో ఇతర రాష్ట్రాల నుంచి యువతీయువకులు ఇక్కడికొచ్చి ఉపాధి పొందుతున్నారన్నారు. చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ నేపథ్యంలో రా.. కదిలిరా.. బహిరంగ సభకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, జనసేన నాయకులు పెద్దఎత్తున హాజరై, విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మడకశిర ఎమ్మెల్యే అభ్యర్థి డా.సునీల్‌కుమార్, గుట్టూరు మాజీ సర్పంచ్ సూర్యనారాయణ పాల్గొన్నారు.



చంద్రబాబు పర్యటన ఏర్పాట్లపై చర్చిస్తున్న టీడీపీ నేతలు

నేడే పల్స్ పోలియో

ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు
ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమం
ఊరూరా ఏర్పాట్లు
జిల్లా వైద్యాధికారి ఎస్వీ కృష్ణారెడ్డి వెల్లడి



పుట్టపర్తి రూరల్, మార్చి 2: జిల్లావ్యాప్తంగా పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టనున్నారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్లలోపు చిన్నారులు అందరికీ పోలియో చుక్కలు వేయనున్నారు. జిల్లాలోని ప్రతి గ్రామంలో ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమం చేపట్టనున్నారు. ఆ మేరకు ఊరూరా ఏర్పాట్లు చేపట్టారు.

మహమ్మారిని తుదముట్టిద్దాం..

పోలియో చుక్కలు వేయించి, మహమ్మారిని తుదముట్టిద్దామని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక ఎనుమలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి కలెక్టరేట్ వరకు పాఠశాల విద్యార్థులు, వైద్యసిబ్బందితో కలిసి శనివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం గణేష్ కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. 'పోలియో చుక్కలు వేయిద్దాం.. మహమ్మారిని తరిమికొడదాం' అంటూ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ.. ప్రతి తల్లి.. తమ బిడ్డకు పోలియో చుక్కలు తప్పక వేయించాలని కోరారు. పోలియో రహిత సమాజ స్థాపనకు పాటుపడాలన్నారు. ఇందుకు సంబంధించి జిల్లావ్యాప్తంగా భారీ ఏర్పాట్లు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి కృష్ణయ్య, జిల్లా టీబీ, లెప్రసీ నివారణాధికారి తిప్పయ్య, జిల్లా ఉప వైద్యాధికారి నివేదిత, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జ్యోత్స్న, జిల్లా వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



జిల్లాకేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

ఏర్పాట్లు పూర్తి

పల్స్ పోలియో అమలుకు జిల్లావ్యాప్తంగా ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో ఐదేళ్లలోపు చిన్నారులు మొత్తం 2,09,015 మంది ఉన్నట్లు గుర్తించారు. వీరి కోసం 2,37,320 పోలియో డోసులను సిద్ధం చేశారు. జిల్లావ్యాప్తంగా 44 యూనిట్లు, 6 మునిసిపాలిటీలు, 1915 పోలియో బూత్‌లు, 7660 మంది వ్యాక్సీనేటర్లు, 304 రూట్లు, 304 మంది సూపర్‌వైజర్లు, 240 వాహనాలు సిద్ధం చేసినట్లు జిల్లా వైద్యాధికారి ఎస్వీ కృష్ణారెడ్డి పేర్కొన్నారు.

వైసీపీ కండువా వేయించకపోతే జీతాల్లేవ్‌?

వలంటీర్లకు అమాత్యురాలి హుకుం?

- టీడీపీ వారిని వైసీపీలో చేర్చే బాధ్యత అప్పగింత
- ఒక్కొక్కరు ఐదుగురిని తీసుకురావాల్సిందే..
- తంటాలు పడుతున్న వలంటీర్లు
- చేసేదిలేక కర్ణాటకవారికి కండువా కప్పిస్తున్న వైనం



వలంటీరు దగ్గరుండి మహిళకు కండువా వేయిస్తున్న దృశ్యం (వృత్తంలో వలంటీరు, ఫైల్)

హిందూపురం, మార్చి 2: ప్రస్తుత పరిణామాలను సునిశితంగా గమనిస్తే... వలంటీర్లు.. జగన్ సైన్యమని ముఖ్యమంత్రి పదేపదే చెబుతున్న మాట వాస్తవం అనిపిస్తుంది. ఎందుకంటే... అర్హులకు సక్రమంగా సంక్షేమ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత వలంటీర్లదే. రానురాను ఎవరిని ఉంచాలో, ఎవరిని తొలగించాలో నిర్ణయించే బాధ్యత కూడా వారిదే. పార్టీల అంతర్గత సమాచారం చేరవేసేది, ఓటర్ల జాబితా నుంచి టీడీపీ వారివి తొలగించడం, వైసీపీ వారివి ఎక్కించే బాధ్యతా వారిదే. చివరికి టీడీపీవారిని వైసీపీలోకి చేర్చే బాధ్యత కూడా వారికే ఇచ్చారు. పెనుకొండ నియోజకవర్గంలో పని చేసే వలంటీర్లకు మంత్రి ఉషశ్రీ ఓ గొప్ప బాధ్యత అప్పజెప్పారు. టీడీపీ వారిని తీసుకొచ్చి వైసీపీ కండువా వేయించాలని హుకుం జారీ చేసినట్లు తెలిసింది. అలాచేయని వలంటీర్ల జీతాలు కట్‌చేస్తామని హెచ్చరించినట్లు సమాచారం. దీనిపై ఆ మండలంలోని వలంటీర్లు చర్చించుకుంటున్నారు.

వలంటీర్లకు మంత్రి హుకుం

నియోజకవర్గంలో వైసీపీ బలహీనంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, నివేదిక తెప్పించుకున్న ఆ ప్రజాప్రతినిధి... ఆ ప్రాంతాల్లోని వలంటీర్లను పిలిపించారు. ఒక్కొక్కరు ఐదుగురిని తీసుకొచ్చి వైసీపీ కండువా కప్పించాలని, అలా చేయని వారి పోస్టు ఎన్నికల తరువాత ఊడిపోతుందని అప్పటి వరకు జీతాలు కూడా ఇవ్వమని హెచ్చరించినట్లు సమాచారం. తెలుగుదేశం పార్టీ బలంగా ఉండే ప్రాంతాలను గుర్తించి అక్కడి వలంటీర్లకు ఈ బాధ్యత అప్పగించినట్లు సమాచారం.

కనీసం ఐదుగురిని తీసుకురావాలి

వైసీపీ బలహీనంగా ఉండే ప్రాంతాల్లో తెలుగుదేశం పార్టీకి చెందిన వారిని ఒక్కో వలంటీరు కనీసం ఐదుగురిని తీసుకురావాలని మంత్రి చెప్పినట్లు తెలిసింది. ఐదుగురి కంటే ఎక్కువ మందిని తీసుకొస్తే బహుమతులు అందజేస్తామని చెప్పినట్లు సమాచారం. వలంటీరు 50 మందిని తీసుకొస్తే ఎన్నికల ముందు ప్రత్యేక ఆఫర్ ఇస్తామని, కండువా వేసుకున్న వారికి ఖర్చులకు ఇస్తామని వలంటీర్లకు అమాత్యుల అనుయాయులు చెప్పినట్లు సమాచారం.

కర్ణాటక వారికి వైసీపీ కండువాలు

ఇవన్నీ ఒక ఎత్తైతే... వైసీపీ కండువా కప్పుకోమని, అమాత్యుల కార్యక్రమానికి రామని టీడీపీ వారు చెప్పడంతో... వలంటీర్లు చేసేదేమీలేక పక్కనే ఉన్న కర్ణాటక నుంచి పలువురిని తీసుకొచ్చినట్లు సమాచారం. వారిని మంత్రికి పరిచయంచేసి కండువా వేయించినట్లు తెలిసింది. అధికార పార్టీ సామాజిక వర్గానికి చెందిన వారే కర్ణాటక నుంచి వచ్చి కండువా కప్పుకున్నట్లు ఆ మండలంలో కోడై కూస్తోంది.



వృత్తంలో కర్ణాటకకు చెందిన వ్యక్తి (వృత్తంలో)

కండువా వేసుకుంటేనే పథకాలు

తెలుగుదేశం పార్టీ నాయకులకు సన్నిహితంగా ఉండే వారిని వలంటీర్లు ఎంచుకున్నారు. వారి ఇళ్ల వద్దకు వెళ్లి ... మండలానికి మంత్రి వస్తున్నారని, కార్యక్రమానికి రావాల ని లేకపోతే ప్రభుత్వం ఇచ్చే పథకాలు రద్దవుతాయని హె చ్చరించినట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో సామాన్యులు చేసేదిలేక అమాత్యుల వద్దకు వెళ్లి కండువా కప్పుకున్నట్లు సమావేశం అనంతరం కొంతమంది చెప్పుకున్నారు. అక్కడికి తీసుకెళ్లి కండువా వేయించేవరకు వలంటీరే బాధ్యత తీసుకుంటున్నారు. అమాత్యులు కండువావేసే సమయంలో వారిని పరిచయం చేసే బాధ్యత కూడా వలంటీర్లదే. మంత్రి శుక్రవారం పరిగి మండలంలో పర్యటించారు. ఈ సందర్భంలో కొంత మందిని వైసీపీలో చేర్చారు. తెలుగుదేశం పార్టీకి చెందిన వారిని అత్యధికంగా చేర్పించే బాధ్యత వలంటీర్లు తీసుకోవాలని వారం కిందటే అమాత్యులు తెలిపినట్లు సమాచారం.

భూ పంపిణీకి ఇంకెన్నాళ్లు..?

రెండేళ్లు గడుస్తున్నా పట్టాల పంపిణీ ఏదీ?
కార్యక్రమం అమలుపై దరఖాస్తుదారుల ఆందోళన
చోద్యం చూస్తున్న పాలకులు, ఉన్నతాధికారులు

తనకల్లు



నాడు గ్రామీణ ప్రాంతాల్లో ఏ కుటుంబాన్ని పలకరించినా, ఎంత భూమి ఉంది, ఏయే పంటలు సాగుచేశారని అడిగేవారు. నాడు భూమి ఎంత ఎక్కువ ఉంటే సంఘంలో అంత గుర్తింపు, గౌరవం ఉండేది. నాటి నుంచి నేటి వరకు అది కొనసాగుతూనే ఉంది. భూమి అనేది గౌరవానికి ప్రతీకగా మారిపోయింది. దీంతో ప్రతి వ్యక్తికి భూమి ఉండాలన్న ఆలోచనతో ప్రభుత్వం సైతం భూగరిష్ఠ పరిమితి చట్టం తీసుకొచ్చింది. అంతేకాకుండా భూ వ్యవహారాల్లో ఎన్నో మార్పులు చేపట్టింది. ల్యాండ్‌సీలింగ్ యాక్టు కింద భూయజమానుల నుంచి భూములు తీసుకుని మరీ భూమిలేని నిరుపేదలకు పంచింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ల ద్వారా కూడా భూములు కొనుగోలు చేసి పేదలకు అప్పగించింది. అంతేకాకుండా ఎన్నో యేళ్లుగా భూ పంపిణీ కార్యక్రమాలు కూడా కొనసాగిస్తోంది. ఈ క్రమంలో నేటి వైసీపీ ప్రభుత్వం కూడా మండలంలో రెండేళ్ల కిందట భూపంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇంతవరకు భూములు పంపిణీకి మాత్రం నోచుకోలేదు. దీంతో మండల వ్యాప్తంగా భూమికోసం దరఖాస్తు చేసుకున్న ఎంతోమంది ఆశతో ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం భూ పంపిణీ చేపట్టాలంటే భూమిపై సాగులో ఉంటేనే ఇస్తామనడంతో ఎంతోమంది నిరుపేదలు రూ. వేలకు వేలు ఖర్చు పెట్టి, రెవెన్యూ గుట్టలు చదును చేసి సాగు చేశారు. ఎన్నోయేళ్లుగా ఈ భూములు తమ అధీనంలోనే ఉన్నాయంటూ నమ్మబలికారు. ప్రభుత్వ యంత్రాంగం కూడా కుప్పలు తెప్పలుగా వచ్చిన దరఖాస్తులను కొన్నిచోట్ల పరిశీలించి, మరికొన్ని చోట్ల అధికార పార్టీ నాయకులకు, ప్రలోభాలకు తలొగ్గి భూమిపంపిణీ ఫైల్‌ను సిద్ధం చేసింది.

మండలంలోని అగ్రహారం పల్లి రెవెన్యూ గ్రామంలో ఆరుగురు రైతులకు 4.98 ఎకరాలు, చీకటిమానుపల్లిలో 8మందికి 4.54 ఎకరాలు, మద్యనాయునిపాళ్యంలో 25మందికి 25.60, టి.సదుంలో 27మందికి 26.63, కె.మల్లిరెడ్డిపల్లిలో 67మందికి 99.01, గుర్రంబైలులో 41మందికి 58.75, కోర్తికోటలో 45మందికి 56.74, సీఆర్‌పల్లిలో 36మందికి 39.09, బొంతలపల్లిలో 44మందికి 70.80, కొక్కంటిలో 141మందికి 170.85, తనకల్లులో 29మందికి 34.06, దండువారిపల్లిలో 14మందికి 10, తవళంలో 137మందికి 194.53, ఈతోడులో 89మందికి 98.66, ముండ్లవారిపల్లిలో 30మందికి 38.89, వెంకటరాయునిపల్లిలో 38మందికి 55.76, కోటపల్లిలో 118మందికి 119.08 ఎకరాల చొప్పున మండల వ్యాప్తంగా 893మంది రైతులకు 1107.97 ఎకరాలకు సంబంధించి ఫైలు సిద్ధం చేశారు. ఇందుకు అసైన్డ్‌మెంట్ కమిటీ ఆమోదం కూడా పొందారు. అనంతరం జాబితాను ఉన్నతాధికారులకు నివేదించారు. అయితే ఇప్పటివరకు ఉన్నతాధికారులు ఎలాంటి నిర్ణయాలు తీసుకోకపోవడంతో భూపంపిణీ జరగలేదు. ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తుండడంతో భూ పంపిణీ జరుగుతుందా లేదా అని దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి భూ పంపిణీ చేపట్టాలని వారు కోరుతున్నారు.



ఈతోడు గ్రామంలో పంపిణీకి సిద్ధంగా ఉన్న ప్రభుత్వ భూమి

ఉన్నతాధికారుల అనుమతి కోసం చూస్తున్నాం..

మండలంలోని వివిధగ్రామాల్లో 893 మంది రైతులు 1107.97 ఎకరాల ప్రభుత్వ భూములు సాగుచేసుకుంటున్నారు. వీరందరూ పట్టాలకోసం దరఖాస్తు చేసుకున్నారు. వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించాం. అసైన్‌మెంట్ కమిటీలో ఆమోదమూ లభించింది. ఉన్నతాధికారుల అనుమతికోసం నివేదికలు సమర్పించాం. ఉన్నతాధికారులు పరిశీలించి, అనుమతి ఇస్తే పంపిణీ చేస్తాం.

- శోభాసువర్ణమ్మ, తహసీల్దార్, తనకల్లు



రెండేళ్లుగా ఎదురు చూస్తున్నాం..

రెండుళ్లుగా భూ పంపిణీ కోసం ఎదురు చూస్తున్నాం. తాను సాగుచేసుకుంటున్న భూమికి పట్టా మంజూరు చేయాలని అధికారులను కోరాను. గ్రామ వీఆర్వో, సర్వేయర్ వచ్చి కొలతలు వేసి పరిశీలించారు. ఇప్పటివరకు పట్టా రాలేదు. ఎన్నికలు సమీపిస్తున్నాయని, భూమి పట్టా వస్తుందో, రాదో అని ఆందోళనగా ఉంది.

-ఈశ్వర్‌నాయక్, బాబేనాయక్‌తండా

పట్టా వెంటనే ఇవ్వాలి..

తమ కుటుంబం ఎన్నోయేళ్లుగా ప్రభుత్వ భూమిని సాగుచేసుకుంటోంది. అందుకు పట్టా ఇవ్వాలని అధికారులను కోరాం. రెండేళ్ల అయినా.. పట్టా రాలేదు. వస్తాయన్న నమ్మకమూ పోయింది. ఇప్పటికైనా వెంటనే పట్టా పంపిణీ చేయాలి.

- వెంకటరమణ, కోటపల్లి



ప్రశాంతంగా ద్వితీయ ఇంటర్ పరీక్షలు

కొత్తచెరువు, మార్చి 2: జిల్లాలో ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు శనివారం ప్రశాంతంగా సాగాయి. జిల్లావ్యాప్తంగా 8,872 మంది సెకండ్ లాంగ్వేజ్ పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా.. 269 మంది గైర్హాజరయ్యారు. దీంతో మొత్తం 8,603 మంది విద్యార్థులు పరీక్షలు రాశారని ఆర్ఐఓ సురేశ్ బాబు తెలిపారు. 4న సోమవారం ప్రథమ సంవత్సరం ఇంటర్ విద్యార్థులకు ఆంగ్లపరీక్ష నిర్వహించనున్నారు.

మోడల్ స్కూల్ ప్రవేశానికి దరఖాస్తులు

కొత్తచెరువు: జిల్లావ్యాప్తంగా మోడల్ స్కూళ్లలో 2024-25 విద్యా సంవత్సరానికిగాను ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ మీనాక్షి శనివారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2022-2023, 2023-2024 విద్యాసంవత్సరాల్లో చదివి ఉండాలన్నారు. ఆరో తరగతిలో ప్రవేశం పొందిన విద్యార్థులకు ఆంగ్ల బోధన ఉంటుందన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు పరీక్ష ఫీజు రూ.150, ఎస్సీ, ఎస్టీ వర్గాలవారు రూ.75 చెల్లించాలన్నారు. ఈనెల 31వతేదీలోగా ఫీజు చెల్లించాలన్నారు. అనంతరం www.cse.ap.gov.in, www.apms.apcfss.in వెబ్‌సైట్‌ల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ సూచించారు. జిల్లాలోని మోడల్ స్కూల్‌లో పరీక్షలు ఏప్రిల్ 21వ తేదీన నిర్వహిస్తామన్నారు. 5వ తరగతి సిలబస్‌లోనే ఆంగ్లమాధ్యమంలో ప్రవేశ పరీక్ష ఉంటుందని వివరించారు.

భద్రం.. బాబూ..



గాండ్లపెంట మండల కేంద్రంలోని ప్రధాన రహదారి. ఉన్నత పాఠశాల నుంచి నాలుగు రోడ్ల కూడలికి వెళ్లే రోడ్డు. నిత్యం రద్దీగా ఉంటుంది. భారీ వాహనాలు సైతం తిరుగుతుంటాయి. అలాంటి రోడ్డులో ఓ పసివాడు సైకిల్‌పై వెళ్తున్నాడు. ఆ రోడ్డులో బాలుడు సైకిల్ తొక్కడమే ప్రమాదకరం అనుకుంటే.. ఉన్నఫలంగా టైరు గాలిలోకి లేపి, విన్యాసం చేయబట్టాడు. దానిని చూసిన వారంతా షాక్‌కు లోనయ్యారు. ఏక్షణం ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడిపోయారు. బాలుడు మాత్రం అలాగే విన్యాసం చేస్తూ వెళ్లిపోయాడు. ఇప్పటికైనా పిల్లలకు సైకిళ్లు, మోటారు సైకిళ్లు ఇచ్చి పంపే తల్లిదండ్రులు కళ్లు తెరవాలి. వారికి సైకిళ్లు, వాహనాలు ఇచ్చి పంపడమంటే వారి ప్రాణాలతో చెలగాటం ఆడటమేనన్న విషయాన్ని గ్రహించాలి.

-గాండ్లపెంట

బాలింత మృతి

● మృతదేహంతో కుటుంబసభ్యులు, బంధువుల ధర్నా



ధర్నా చేస్తున్న మృతురాలి కుటుంబసభ్యులు



సుమలత (ఫైల్)



ఆరోగ్యంగా ఉన్న శిశువు

తాడిపత్రిటౌన్, మార్చి 2: పట్టణం లోని యల్లనూరురోడ్డులో ఉన్న ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం వికటించి బాలింత సుమలత (30) శని వారం మృతి చెందినట్లు పోలీసు లు తెలిపారు. వారు తెలిపిన మేరకు పుట్లూరు మండలం కోమటి కుంట్ల గ్రామానికి చెందిన బాలగం గయ్య, సుమలత దంపతులు కూలీ పనులు చేసుకుంటూ జీవించేవారు. వీరికి రెండేళ్ల కిందట మొదటి కాన్పులో కుమారుడు జన్మించాడు. మరోసారి గర్భం దాల్చిన సుమలత వైద్యపరీక్షలను ప్రైవేట్ ఆసుపత్రిలో చేయించుకునేది. వైద్యులు మార్చి18కి డెలివరీ డేట్ ఇచ్చారు. ఫిబ్రవరి 7న నొప్పులు రావడంతో భర్త, బంధువులు కలిసి సుమలతను ఆసుపత్రికి తీసుకువచ్చారు. పరీక్షిం చిన వైద్యులు వెంటనే సిజేరియన్ చేయాలని లేకపోతే ప్రాణాలకు ముప్పు ఉంటుందని తెలిపారు. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు ఆపరేషన్‌కు ఒప్పుకున్నారు. ఆపరేషన్ చేయడంతో సుమలత పాపకు జన్మనిచ్చింది. శిశువు ఆరోగ్యంగానే ఉన్నా తల్లి ఆరోగ్య పరిస్థితి సరిగా లేకపోవడంతో అనంతపురం తీసుకువెళ్లాలని వైద్యులు సూచించారు. వెంటనే కుటుంబ సభ్యులు అనంతపురం తీసుకు వెళ్లారు. అక్కడి నుంచి బెంగళూరులో కొన్ని రోజులు, అక్కడి నుంచి తిరుపతిలో కొన్ని రోజులు చికిత్స తీసుకున్నారు. చివరగా కడపకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సుమలత శనివారం ఉదయం మృతి చెందింది. భర్తతో పాటు కుటుంబసభ్యులు, బంధువులు మృతదేహాన్ని తీసుకొని నేరుగా యల్లనూరురోడ్డులో ఉన్న ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ధర్నాకు దిగారు. డీఎస్పీ గంగయ్య, సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ షేక్‌గౌస్‌బాషా సిబ్బందితో కలిసి ఆసుపత్రికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. అనంతరం ఆసుపత్రి యాజమాన్యం, మృతురాలి కుటుంబసభ్యులతో మాట్లాడారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

చెన్నై బీచ్‌లో ఇద్దరు విద్యార్థుల గల్లంతు



పెద్దిరాజు



శేషారెడ్డి

● విహార యాత్రకు వెళ్లిన పెన్నా కాలేజ్ ఆఫ్ సిమెంట్ సైన్సెస్ విద్యార్థులు
● అలల తాకిడికి కొట్టుకుపోయిన ఎనిమిది మంది
● ఆరుగురిని రక్షించిన రెస్క్యూ టీం
● ఇద్దరి జాడ తెలియక తల్లిదండ్రుల్లో ఆందోళన



శనివారం ఉదయం చెన్నై బీచ్‌లో విద్యార్థులు దిగిన గ్రూప్‌ఫొటో సర్కిల్‌లో అలలకు కొట్టుకుపోయిన పెద్దిరాజు, శేషారెడ్డి



ప్రిన్సిపాల్‌తో వివరాలు ఆరాతీస్తున్న పోలీసులు

యాడికి, మార్చి 2: విహార యాత్రకు వెళ్లిన ఇద్దరు జిల్లా విద్యార్థులు చెన్నై బీచ్‌లో శనివారం గల్లంతయ్యారు. అనంతపురం జిల్లా యాడికి మండలం బోయరెడ్డిపల్లి వద్ద ఉన్న పెన్నా కాలేజ్ ఆఫ్ సిమెంట్ సైన్సెస్ విద్యార్థులు పెద్దిరాజు, శేషారెడ్డి సముద్రపు అలల తాకిడికి కొట్టుకుపోయారు. వారిజాడ కోసం రెస్క్యూటీం గాలింపు చర్యలు చేపట్టినట్లు కళాశాల సిబ్బంది తెలిపారు. యాడికి మండలం బోయరెడ్డిపల్లి వద్ద పెన్నా సిమెంట్ ఫ్యాక్టరీ ఉంది. ఫ్యాక్టరీ ఆవరణలో యాజమాన్యం పెన్నా కాలేజ్ ఆఫ్ సిమెంట్ సైన్సెస్ పేరిట కాలేజీ నిర్వహిస్తోంది. ఇక్కడ విద్యార్థులు సిమెంట్ సైన్స్‌లో డిప్లొమో అభ్యసిస్తున్నారు. యాడికి మండలం కుందనకోట గ్రామానికి చెందిన పెద్దిరాజు, పెద్దవడుగూరు మండలం అప్పేచర్ల గ్రామానికి చెందిన శేషారెడ్డి సహా 26 మంది విద్యార్థులు ఫైనల్ ఇయర్ చదువుతున్నారు. ఏప్రిల్ నెలాఖరుకు వారి కోర్సు పూర్తి అవుతుంది. ఈ నేపథ్యంలో తొమ్మిది రోజుల విహార యాత్ర నిమిత్తం శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో కళాశాల నుంచి బయలుదేరారు. విద్యార్థుల్లో నలుగురు మినహా 22 మంది, సిబ్బంది మరో నలుగురు విహారయాత్రకు వెళ్లారు. వీరు శనివారం ఉదయం చెన్నై బీచ్‌కు చేరుకున్నారు. అందరూ కలిసి గ్రూప్ ఫొటో తీసుకున్నారు. కళాశాలలో ఉన్న అధ్యాపక బృందానికి ఆ ఫొటో పంపి తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఆ తరువాత ఈతకు వెళ్లి.. ఎనిమిది మంది విద్యార్థులు అలల తాకిడికి కొట్టుకుపోయారు. వీరిలో ఆరుగురిని రెస్క్యూటీం కాపాడింది. పెద్దిరాజు (21), శేషారెడ్డి (21) నీటిలో గల్లంతయ్యారు. వారి కోసం గాలింపు కొనసాగుతోంది. సమాచారం తెలుసుకున్న పెద్దిరాజు తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్థులు కళాశాల వద్దకు వచ్చి ఆందోళనకు దిగారు. ప్రిన్సిపాల్, సిబ్బందితో తీవ్రస్థాయిలో వాగ్వాదం చేశారు. కళాశాల ఆవరణలో కుర్చీలను ధ్వంసం చేశారు. పోలీసులు వారికి సర్దిచెప్పారు. ఇద్దరు గల్లంతయ్యారని తెలియగానే కాలేజీలో ఉన్న విద్యార్థులు తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. అక్కడున్నవారికి ఫోన్ చేసి సమాచారం తెలుసుకుంటూ.. తమ మిత్రులు క్షేమంగా బయటపడాలని ఆకాంక్షించారు.

కూలీల బిడ్డ పెద్దిరాజు

యాడికి మండలం కుందనకోట గ్రామానికి చెందిన పెద్దయ్య, లక్ష్మీదేవి దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కూలి పనులు చేసుకుంటూ జీవనం గడుపు తున్నారు. కుమారుడు పెద్దిరాజు పెన్నా సిమెంట్ సైన్సెస్ కాలేజీలో చదువుతున్నాడు. విహారయాత్రకు వెళతానని చెప్పడంతో తమ వద్ద డబ్బులు లేకపోయినా, అప్పు చేసి రూ.15 వేలు ఇచ్చి పంపామని తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. తాము వద్దని చెప్పామని, కచ్చితంగా రావాల్సిందేనని కాలేజీలో అంటున్నారనడంతో పంపించామని వాపోయారు. చేతికి వచ్చిన కొడుకు జాడ తెలియకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

రైతు బిడ్డ శేషారెడ్డి

పెద్దవడుగూరు మండలం అప్పేచర్ల గ్రామానికి చెందిన వెంకటరామిరెడ్డి, నారాయణమ్మ దంపతులకు ఇద్దరు కూ తుళ్లు కాగా, ఒక్కగానొక్క కుమారుడు శేషారెడ్డి. వీరిది వ్యవసాయ కుటుంబం. విషయం తెలియగానే వారు బంధువులతో కలిసి చెన్నైకి వెళ్లారు.

ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థి డీబార్

● 2వ రోజు 418 మంది గైర్హాజరు

అనంతపురం విద్య, మార్చి 2: ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఓ విద్యార్థిని అధికారులు డీ బార్ చేశారు. శనివారం అనంతపురం నగరంలోని న్యూటౌన్ జూనియర్ కాలేజీలో సెకెండ్ లాంగ్వేజ్ పరీక్షలు రాస్తూ మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన విద్యార్థిని అధికారులు డీబార్ చేశారు. రెండోరోజు జిల్లావ్యాప్తంగా జనరల్ విద్యార్థులు 16,478 మందికిగాను 16,097 మంది హాజరు కాగా 381 మంది గైర్హాజరయ్యారు. అదేవిధంగా ఒకేషనల్ విద్యార్థులు 1193 మందికిగాను 1156 మంది హాజరుకాగా 37 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. కన్వీనర్ మూడు కేంద్రాలను, జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు 4 కేంద్రాలను, ఫ్లైయింగ్‌స్క్వాడ్ 8 కేంద్రాలను, సిట్టింగ్‌స్క్వాడ్ 2 కేంద్రాలను తనిఖీ చేసినట్లు డీఈసీ కన్వీనర్ వెంకటరమణ నాయక్ పేర్కొన్నారు.

రేపు విలేజ్ వెటర్నరీ అసిస్టెంట్లకు నియామకపు ఉత్తర్వులు

అనంతపురం అర్బన్, మార్చి 2 : ఉమ్మడి అనంత జిల్లాలో 439 మంది వెటర్నరీ అసిస్టెంట్లకు నియామక ఉత్తర్వులు ఇవ్వనున్నారు. సోమవారం కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తర్వులు అందజేయడంతో పాటు స్థానాలు కేటాయించనున్నట్లు ఇవ్వనున్నట్లు పశుసంవర్ధక శాఖ జేడీ సుబ్రహ్మణ్యం శనివారం ప్రకటించారు.

రాష్ట్రస్థాయికి రెండు ప్రాజెక్టులు

అనంతపురం విద్య, మార్చి 2 : రాష్ట్ర స్థాయి ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఈఎండీపీ) ప్రదర్శనకు జిల్లా నుంచి రెండు ప్రాజెక్టులు ఎంపికైనట్లు డీఈఓ వరలక్ష్మి, జిల్లా సైన్స్ ఆఫీసర్ బాలమురళి పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాల్లో చదివే 9వ తరగతి విద్యార్థుల్లో వ్యాపార మెలకువలు, ఉత్పాదక శక్తిని పెంచడానికి స్కూళ్లలో ఈఎండీపీ కార్యక్రమం నిర్వహించారు. 73 స్కూళ్ల నుంచి 100 ప్రాజెక్టులు నమోదు కాగా...వాటిలో 10 ప్రాజెక్టులను శనివారం సైన్స్ సెంటర్‌లో ప్రదర్శించారు. వీటిలో రెండు ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. ఎంజేపీ బీసీ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు గ్లోరీ, చందన, శ్రుతి, గైడ్ టీచర్ హిమబిందు తయారుచేసిన స్వచ్ఛ భారత్ బ్యాగుల ప్రాజెక్టు జిల్లాలో మొదటి బహుమతికి, నార్పల ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు సాయి చరణ్, రేవంత్, గైడ్ టీచర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో తయారు చేసిన అనిమల్ అలర్ట్ అలారం ప్రాజెక్టు రెండో బహుమతికి ఎంపికైంది. డీఈఓ, సైన్స్ ఆఫీసర్ ఆయా విద్యార్థులను అభినందించారు. ఈ రెండింటిని ఈనెల 6న విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రదర్శిస్తారని తెలిపారు.

ఎన్నికల సిబ్బంది నియామకం

అనంతపురం టౌన్, మార్చి 2 నియోజకవర్గస్థాయిలో ఎన్నికల నిర్వహణకు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేశారు. నియోజవర్గాల్లో సిబ్బందికి ఎన్నికల విధులపై అవగాహన లేనందున అనుభవం ఉన్నవారిని ఇవ్వాలని ఆర్‌ఓలు కలెక్టరును కోరారు. కలెక్టర్ ఆదేశాల మేరకు చురుగ్గా పనిచేసే 30 మందిని ఆర్డీఓలు ఎంపిక చేశారు. ఎంపిక చేసిన జాబితాకు శనివారం కలెక్టర్ ఆమోదముద్ర వేశారు. 8నియోజకవర్గాలకు కలిపి 23 మంది, కలెక్టరేట్లో పని చేయడానికి మరో ఏడుమందిని నియమించారు. డీటీలు, సీనియర్ అసిస్టెంట్లు, ఈడీటీలు ఉన్నారు.

వేరుశనగ విక్రయాలకు పేర్లు నమోదు చేసుకోండి

అనంతపురం అర్బన్, మార్చి 2: జిల్లాలో 2023-24 రబీ సీజన్‌లో పండించిన వేరుశనగను విక్రయించేందుకు రైతులు ఆర్బీకేలో పేర్లు నమోదు చేసుకోవాలని ఏపీ మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి ప్రకటించారు. క్వింటా వేరుశనగ రూ. 6,377గా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎన్నాళ్లీ.. ఎదురు చూపు..!



● రెండో తేదీ ముగిసినా జీతాలు నిల్... ● సగం మంది ఉద్యోగులకు కూడా అందలేదు.. ● పెన్షనర్లదీ అదే పరిస్థితి ● ఈఎంఐలు చెల్లించలేక సతమతం ● మూడేళ్లుగా అమలు కాని సరెండర్ ఆఫ్ ఎర్న్ లీవ్స్ ● జీపీఎఫ్‌ను రూ. లక్షకే పరిమితం చేయడంపై వేతనజీవుల ఆగ్రహం



అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి2: రాష్ట్ర ప్రభుత్వ తీరుతో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు విసిగిపోతున్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అలవెన్సులు కాదు కనీసం 1వ తేదీనే జీతం, పెన్షన్లు అందుకునే పరిస్థితి లేకుండాపోయాయని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే ఉద్యోగులకు అందాల్సిన రకరకాల అలవెన్సులను పెండింగ్‌లో ఉంచి ఆయా వర్గాలను తీవ్ర మానసిక వేదనకు గురిచేస్తోంది. జీతాలను నమ్ముకుని వివిధ రకాల లోన్లు తీసుకున్న ఉద్యోగులు ఈఎంఐలు కట్టుకోలేని గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. సమయానికి సొమ్ము చెల్లించకపోవడంతో బ్యాంకులు, ఫైనాన్స్ కంపెనీల నుంచి ఒత్తిళ్లు ఎదుర్కొంటున్నట్లు వాపోతున్నారు. రెండవ తేదీ ముగిసినప్పటికీ... సగం సగం మందికే వేతనాలు, పెన్షన్లు విడుదలవడంతో మిగిలిన వారు తమకెప్పుడు అందుతాయోనన్న మిగిలిన వారు ఆందోళన చెందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్నిప్రభుత్వ కార్యాలయల్లో కలుపుకొని 40 వేలమందికిపైగా ఉద్యోగులు ఉన్నారు. వీరిలో ఇప్పటి వరకూ 20 శాతం మంది వరకూ జీతాలు పడినట్లు తెలుస్తోంది. ఇక ప్రభుత్వ పెన్షనర్ల విషయానికొస్తే జిల్లా వ్యాప్తంగా 25 వేల మంది ఉండగా... ఇప్పటి వరకూ కేవలం 5 వేల మందికి మాత్రమే ఖాతాలో సొమ్ము జమ అయినట్లు సమాచారం.

మూడేళ్లుగా అందని సరెండర్ ఆఫ్ ఎర్న్ లీవ్స్ నగదు

ప్రభుత్వ ఉద్యోగులకు అందించే సరెండర్ ఆఫ్ ఎర్న్ లీవ్స్ మూడేళ్లగా అమలుకాకపోవడంతో ఉద్యోగ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. సంవత్సరానికి 15 రోజులు చొప్పున అమలయ్యే సెలవులకు సంబంధించిన నగదును సైతం రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వకుండా కాలయాపన చేస్తుండటంతో ఆ వర్గాలు నిట్టూరుస్తున్నాయి. ఈ లీవ్స్ వాడుకోనే ఉద్యోగులు నగదు కోసం ఎన్నిసార్లు ఫైల్స్ సబ్మిట్ చేసుకున్నా ఆ డబ్బు రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జీపీఎఫ్ విషయంలోనూ రాష్ట్ర ప్రభుత్వం అదే నిర్లక్ష్య వైఖరిని కనబరుస్తోందనే చెప్పాలి. ఉద్యోగులు దాచుకున్న డబ్బును అవసరాలకు వినియోగించుకుందామంటే అసలు జీపీఎఫ్ ఆన్‌లైన్‌లో కనిపించకుండా చేసింది. తాజాగా... ఉద్యోగుల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతన్న నేపథ్యంలో జీపీఎఫ్ నిధులు ఇవ్వడానికి ముందుకొచ్చినప్పటికీ... వాటిని రూ. లక్ష వరకే పరిమితం చేయడంపై ఉద్యోగ వర్గాలు మండిపడుతున్నాయి. తాము దాచుకున్న సొమ్మును ఇచ్చేందుకు పరిమితి ఎందుకని ప్రశ్నిస్తున్నారు.

ఇలాంటి ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదు..

● పెద్దనగౌడ్, ఏపీ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు



నా సర్వీసులో ఇలాంటి ప్రభుత్వాన్ని ఎన్నడూ చూడలేదు. కనీసం మాకు ఇవ్వాల్సిన పెన్షన్‌ను సైతం 1వ తేదీన ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తోంది. ప్రభుత్వం నుంచి పెన్షనర్లకు అందాల్సిన పథకాల విషయంలోనూ కోతలు పెడుతూ ఇబ్బందులకు గురిచేస్తోంది. ఈ నెలకు సంబంధించి కేవలం 5 వేల మంది పెన్షనర్లకు మాత్రమే నగదు జమ అయ్యింది. ఇంక మిగిలిన వారి పరిస్థితి ఏంటి..? వారికి ఎప్పుడిస్తారు..? చాలా బాధాకరం. ఈ ప్రభుత్వం మారే వరకూ పెన్షనర్లకు ఇబ్బందులు తప్పేలా లేదు.

1వ తేదీనే జీతాలివ్వాలి..

●మనోహర్‌రెడ్డి, ఏపీ ఎన్జీఓ నగర అధ్యక్షుడు



రాష్ట్ర ప్రభుత్వం 1వ తేదీనే ఉద్యోగులకు జీతాలిచ్చి ఆదుకోవాలి. జీతంపైనే ఆధారపడి జీవిస్తున్న ఉద్యోగులకు జీతం ఆలస్యమైతే అనేక రకాలైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈఎంఐలు, హౌస్ లోన్లు చెల్లించక పోవడంతో అధిక వడ్డీ భరించాల్సి వస్తోంది. సరెండర్ ఆఫ్ ఎర్న్ లీవ్స్ నగదును వెంటనే రిలీజ్ చేసి ఉద్యోగులను ఆదుకోవాలి. జీపీఎఫ్ విషయంలో విధించిన రూ.లక్ష పరిమితిని తీసేసి మునుపటిలాగానే 75 శాతం చొప్పున విడుదల చేయాలి.

చంద్రబాబు పర్యటన షెడ్యూల్ ఖరారు


పుట్టపర్తి, మార్చి2(ఆంధ్రజ్యోతి): పెనుకొండ సమీపంలోని కియ పరిశ్రమ వద్ద నిర్వహిస్తున్న రా.. కదలిరా.. సభకు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సోమవారం హాజరుకానున్నారు. ఆయన పర్యటనకు సంబంధించిన షెడ్యూల్ ఖరారైంది. చంద్రబాబు హైదరాబాద్‌లో ఈనెల 4న మధ్యాహ్నం 12.30కి బయలుదేరి బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. ప్రత్యేక విమానంలో ఒంటి గంటకు బెంగుళూరు చేరుకుంటారు. అక్కడి నుంచి హెలీకాప్టర్‌లో మధ్యాహ్నం 2.45కి పెనుకొండ మండలం ఎర్రమంచి వద్ద ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌లో దిగుతారు. కియ ఎదురుగా రా.. కదలిరా.. సభా వేదిక వద్దకు చేరుకుంటారు. 3 గంటల నుంచి 4.30దాకా బహిరంగ సభలో చంద్రబాబు ప్రసగింస్తారు. 4.45కి ఎర్రమంచి హెలీప్యాడ్ నుంచి బయలుదేరి బెంగుళూరు హెచ్ఏఎల్ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి హైదరాబాద్ వెళ్లారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీకి స్పెషల్‌డ్రైవ్

అనంతపురం టౌన్ మార్చి 2: జిల్లాలో ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీకి స్పెషల్‌డ్రైవ్ చేపడుతున్నామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డికి జిల్లాకలెక్టరు గౌతమి తెలిపారు. శనివారం సీఎస్ పలుప్రభుత్వ పథకాల అమలుపై వీడియోకాన్ఫరెన్స్‌లో ఆరా తీశారు. అనంతరం కలెక్టరు మాట్లాడుతూ జిల్లాకు 5.11 లక్షల ఆరోగ్య శ్రీకార్డులు రావాల్సి ఉందన్నారు. ఇప్పటికి 1.90 లక్షల కార్డులు రాగా వాటిని స్పెషల్‌డ్రైవ్ చేపట్టి లబ్ధిదారులకు పంపిణీ చేస్తామన్నారు. జిల్లాలో 3.50 లక్షల ఆరోగ్యశ్రీ యాప్‌లో డౌన్‌లోడ్‌లు పూర్తయ్యాయని, మిగిలినవారికి వారి ఫోన్లలో చేయిస్తామన్నారు. డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, డీసీహెచ్ఎస్ డాక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు

● నేడు పల్స్ పోలియో కార్యక్రమం



పల్స్‌పోలియోపై ర్యాలీ చేపడుతున్న అధికారులు

అనంతపురం టౌన్, మార్చి 2: చిన్నారుల నిండు జీవితానికి రెండు చుక్కలు వేయించాలని జడ్పీ సీఈఓ నిదియా దేవి, నగరపాలిక కమిషనర్ మేఘ స్వరూప్, డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి సూచించారు. పల్స్ పోలియోపై అవగాహన కల్పించడంకోసం జిల్లావ్యాప్తంగా వైద్యశాఖ ఆధ్వర్యంలో శనివారం ర్యాలీలు నిర్వహించారు. నగరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల వద్ద డీఎంహెచ్ఓ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ప్రధాన రహదారులపై ర్యాలీ కొనసాగింది. రెండు చుక్కల పోలియో డ్రాప్స్ వేయడంద్వారా పోలియో మహమ్మారిపై విజయం సాధించవచ్చని వారు అన్నారు. జిల్లావ్యాప్తంగా ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో చుక్కలు వేస్తారని అన్నారు. జిల్లాలో 2,79,980 మంది చిన్నారులు ఉన్నారని, వీరందరికి పోలియో చుక్కలు వేసేందుకు 1,785 కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు. పోలియో చుక్కలు వేయడానికి సిబ్బందిని నియమించామని తెలిపారు. ఆదివారం చుక్కలు వేయించుకోనివారిని గుర్తించేందుకు సోమ, మంగళవారాలలో ఇంటింటికీ సిబ్బంది వెళ్లి, పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయ భాస్కర్ రెడ్డి, డీఐఓ డాక్టర్ యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

ఖరీదైన వైద్య పరీక్షలు ఉచితంగా..

● క్యాన్సర్ పరీక్షలకు క్యూ కట్టిన జనం ● మొదటి రోజు 300 మందికి.. ● నేడు కూడా శిబిరం

హిందూపురం, మార్చి 2: కార్పొరేట్ ఆస్పత్రుల్లో అందే ఖరీదైన వైద్య పరీక్షలను ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సూచన మేరకు ఇక్కడికే వచ్చి ఉచితంగా చేస్తున్నట్లు వైద్యులు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన బసవతారకం ఇండో-అమెరికన్ ఆస్పత్రి పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో క్యాన్సర్ నిర్ధారణ ఉచిత పరీక్షల సంచార వైద్య శిబిరం శనివారం స్థానిక ఎమ్మెల్యే నివాసం వద్ద నిర్వహించారు. సుమారు రూ.3కోట్ల విలువచేసే అత్యాధునిక వైద్య పరికరాలతో కూడిన క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసే సంచార వైద్యశాల వాహనాన్ని కొనుగోలు చేసిన వెంటనే హిందూపురానికి పంపారు. ఇక్కడే ఈ వాహనాన్ని ప్రారంభిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. ఆదివారం కూడా ఇక్కడే ఉంటుందన్నారు. నియోజకవర్గంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి వైద్యులు సుధాకర్, శ్రావణికుమారి, హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ రోహిల్, ఆర్ఎంఓ రుక్మిణమ్మ వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. 300మందికి ఎక్స్‌రే, అల్ట్రా సౌండ్ తదితర వైద్య పరీక్షలు చేశారు. ఒకరికి ఇబ్బందికరంగా ఉండడంతో ఎమ్మెల్యే సొంత ఖర్చులతో అంబులెన్స్ ద్వారా కర్నూలుకు పంపారు. మిగిలిన వారికి హైదరాబాద్ రావాలని సూచించారు. అనంతరం టీడీపీ నేత డా.సురేంద్ర, కోఆర్డినేటర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రజల సౌకర్యార్థం ఖరీదైన వైద్య పరీక్షలను ఉచితంగా చేయాలని ఎమ్మెల్యే ఆదేశించడంతో నూతనంగా కొనుగోలుచేసిన వాహనాన్ని ఇక్కడకు పంపారన్నారు. దీనిని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే సేవా కార్యక్రమాలకు తమవంతు కృషి చేస్తున్నారన్నారు. కరోనా ఆపదకాలంలో రూ.కోట్ల విలువచేసే మందులు, వైద్య పరికరాలను ఇక్కడకు పంపారన్నారు. ఆయన ఎక్కడున్నా ప్రజల బాగోగులపై ప్రత్యేక దృష్టి సారిస్తుంటారని పేర్కొన్నారు.



వైద్యశిబిరంలో పేర్లు నమోదు చేసుకుంటున్న దృశ్యం

పోలీసుల సంక్షేమమే పరమావధి: డీఐజీ

అనంతపురం క్రైం,మార్చి 2: పోలీస్ సిబ్బంది, కుటుంబాల సంక్షేమమే పరమావధి అని అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి అన్నారు. జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఎస్పీ అన్బురాజన్ సంకల్పంతో నూతనంగా నిర్మించిన, పునరుద్ధరించిన వివిధ సంక్షేమ కార్యక్రమాలను డీఐజీ ప్రారంభించారు. ఇండోర్ స్టేడియంను ఎస్పీతో కలిసి డీఐజీ ఓపెన్ చేశారు. పోలీస్ యూనిట్ ఆసుపత్రి పునరిద్ధరించిన అనంతరం ఆసుపత్రిని ప్రారంభించారు. జిల్లా పోలీసు ట్రాన్స్‌పోర్ట్ విభాగం ప్రాంగణంలో కొత్తగా నిర్మించిన ఎంటి ల్యూబ్రికేషన్స్ స్టోర్స్ భవనాన్ని ప్రారంభించారు. అదనపు ఎస్పీ విజయభాస్కర్‌రెడ్డి, రామక్రిష్ణ, ఏఆర్ అదనపు ఎస్పీ లక్ష్మినారాయణరెడ్డి, డీఎస్పీలు వీరరాఘవరెడ్డి, టీవీ శివారెడ్డి పాల్గొన్నారు.

పదోన్నతి కల్పించిన ఎస్పీకి కృతజ్ఞతలు: హెడ్ కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐగా పదోన్నతి కల్పించినందుకు ఎస్పీ అన్బురాజన్‌కు సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా పట్నం పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న నూర్ మహమ్మద్, హిందూపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న నీలవేణికి హెడ్ కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐగా పదోన్నతి లభించింది. నూర్‌మహమ్మద్‌ను కనగానపల్లికి, నీలవేణిని గుంతకల్లు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. వీరు పోలీస్ అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులతో కలిసి ఎస్పీ అన్బురాజన్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అన్నమయ్య జిల్లా నుంచి జిల్లా ఏఆర్‌కు బదిలీపై వచ్చిన జాఫర్ ఎస్పీని కలిశారు. సాకేత్రిలోక్‌నాథ్, జాఫర్, సుధాకర్‌రెడ్డి, హరినాథ్, తేజ్‌పాల్, శ్రీనివాసుల నాయుడు ఉన్నారు.



పోలీస్ సంక్షేమ కార్యక్రమాల ప్రారంభోత్సవంలో డీఐజీ, ఎస్పీ

ప్రేమికుడి ఆత్మహత్య

● ప్రియురాలు ఆత్మహత్యాయత్నం

కళ్యాణదుర్గం రూరల్, మార్చి 2: ప్రేమికుడు ఆత్మహత్య చేసుకోవడంతో ప్రియురాలు ఆత్మహత్యకు యత్నించిన సంఘటన శనివారం కంబదూరు మండలం గుద్దెళ్ల గ్రామంలో జరిగింది. ఔట్‌పోస్టు పోలీసులు, గ్రామస్థులు తెలిపిన మేరకు కళ్యాణదుర్గం మండలంలోని కామక్కపల్లికి చెందిన హరిభూషణ్ (25), ఓ యువతి ప్రేమించుకున్నారు. వారిద్దరూ మూడు రోజుల కిందట ఇంట్లో నుంచి వెళ్లిపోయారు. యువతి తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడానికి శుక్రవారం రూరల్ పోలీస్‌స్టేషన్‌కి వెళ్లారు. పోలీసుల సమక్షంలోనే ఆ యువతికి తల్లిదండ్రులు ఫోన్ చేశారు. 'సార్ మేము మేజర్లం. పెళ్లి చేసుకున్నాం. స్టేషన్‌కి వస్తున్నాం' అని పోలీసులకు ఫోన్‌లోనే చెప్పారు. వారు వస్తున్న క్రమంలో శుక్రవారం రాత్రి మార్గమధ్యలో యువకుడి మేనమామ బాబుజీ ఇంటికి వెళ్లారు. తన తల్లిదండ్రులు తమ ప్రేమకు ఒప్పుకోరు అనే భయంతో యువకుడు తన మేనమామ ఇంటి వద్దే బహిర్భూమికి అని వెళ్లి చెట్టుకు ఉరివేసుకున్నాడు. ప్రియుడు ఆత్మహత్య చేసుకోవడంతో ఆ యువతి తట్టుకోలేక ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు ఆమెను కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. యువతి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

ఎన్నికల్లో జగన్‌కు బుద్ధి చెబుదాం

● రా.. కదలిరా.. సభను విజయవంతం చేద్దాం ● టీడీపీ శ్రేణులకు మాజీమంత్రి పల్లె పిలుపు


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ పల్లె రఘునాథ రెడ్డి

పుట్టపర్తి, మార్చి 2 : అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలకు నిలయమైన జగన్ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని మాజీమంత్రి పల్లె రఘునాథ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం ఆయన పార్టీ నియోజకవర్గస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏపీని రాజధాని లేని రాష్ట్రంగా భ్రష్టు పట్టించిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. జగన్ పాలనలో రాష్ట్రంలో అరాచకాలు, అక్రమాలు, దౌర్జన్యాలు తప్ప ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. రాష్ట్రం మళ్లీ గాడిన పడాలంటే చంద్రబాబు సీఎం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలన్నారు. సోమవారం పెనుకొండ సమీపంలోని కియ పరిశ్రమ వద్ద రా.. కదలిరా సభ జరగనుందని, పార్టీ అధినేత చంద్రబాబు పాల్గొననున్నారని, బహిరంగసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి జిల్లా ఎన్నికల పరిశీలకుడు రవీంద్ర మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని 14స్థానాలు టీడీపీ కైవశం చేసుకోవాలన్నారు. టీడీపీని గెలిపించడానికి పార్టీశ్రేణులు కృషి చేయాలన్నారు. మాజీ ఎంపీ నిమ్మలకిష్టప్ప మాట్లాడుతూ రాష్ట్రంలో సైకో ప్రభుత్వం పోయి సైకిల్ రావాలన్నారు. అనంతరం పల్లె చేతులమీదుగా నియోజకవర్గ పరిశీలకుడు టీడీపీ ఎన్నికల శంఖారావం కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, కన్వీనర్లు రామాంజనేయులు, వలిపి శ్రీనివాసులు, రామక్రిష్ణ, మంజురెడ్డి, మైలే శివశంకర్, జయచంద్ర, గోపాల్‌రెడ్డి, విజయ్‌కుమార్, కృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, రాయల్ మురళి, కాలేనాయక్, రామాంజి, శ్రీనివాసులు, జాకీర్, కేశవరెడ్డి, రమణ, కొండే ఈశ్వరయ్య, ఓబుళరెడ్డి, జయప్రకాశ్, మాణిక్యంబాబా, లావణ్య, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

సీబీఐ అంటే జగన్‌కు వణుకు

వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో సీఎం జగన్ పాత్రపై సీబీఐ విచారణ చేపట్టాలని సునీత పేర్కొనడంపై జగన్‌కు వణుకు మొదలైందని మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వివేకానందరెడ్డి హత్యకేసులో జగన్‌రెడ్డి పాత్రపై పూర్తి విచారణ జరిగితే అసలు దోషులు బయట పడతారన్నారు. ఐదేళ్లుగా కేసు నాన్చడంపై వివేకానంద రెడ్డి కుమార్తె సునీత సీబీఐ విచారణ చేయాలనడంతో జగన్ ఎందుకు వద్దంటున్నాడో అది ఆయనకే తెలియాలన్నారు. మొదట సీబీఐ విచారణ చేయాలని, ఆ తరువాత వద్దని పేర్కొనడంపై వెనుక గల కారణాన్ని రాష్ట్ర ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.

టీడీపీ సత్తా చూపిద్దాం

● పెనుకొండలో రా.. కదలిరా.. సభను సక్సెస్ చేద్దాం

● నాయకులు, కార్యకర్తలకు పరిటాలశ్రీరామ్ పిలుపు


మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

ధర్మవరం, మార్చి 2: ధర్మవరం నియోజకవర్గంలోని టీడీపీ సత్తా ఏంటో చూపిద్దామని, ఇక్కడ తెలుగుదేశం పార్టీ బలం ఎంత ఉందో మరోసారి చాటిచెప్పే సమయం వచ్చిందని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. ఈనెల 4వ తేదీన పెనుకొండలో జరిగే రా కదలిరా బహిరంగసభకు నియోజకవర్గంలోని టీడీపీ శ్రేణులందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. ఆ దిశగా నాయకులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సభ హైలెట్‌గా నిలవాలన్నారు. ప్రతి కార్యకర్త, నాయకుడు దీనిని బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఈ బహిరంగ సభకు సంబంధించి విస్తృత ప్రచారం చేసి ప్రజలు తరలివచ్చేలా చూడాలన్నారు. గతం లో నారాలోకేశ్ పాదయాత్ర ధర్మవరం నియోజకవర్గంలో హైలెట్‌గా జరిగిందని, అదే తరహా లో చంద్రబాబు సభను కూడా సక్సెస్ చేసి సత్తా చాటుదామని పరిటాలశ్రీరామ్ పిలుపునిచ్చారు.

పలువురికి పల్లె పరామర్శ

ఓబుళదేవరచెరువు, మార్చి 2: మండలంలోని పలువురు టీడీపీ కార్యకర్తలు, నాయకులను మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి శనివారం పరామర్శించారు. మండలకేంద్రంలోని ఎస్సీకాలనీకి చెందిన ఎస్సీసెల్ మండల నాయకుడు అంజనప్ప కొద్దిరోజులక్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా.. పల్లె ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్నపాత్రికేయుడు పుష్పాల శంకర్, కార్యకర్త రహిమాన్‌ను పరామర్శించారు. అల్లాపల్లి పంచాయతీ బాలప్పగారిపల్లికి చెందిన క్రిష్టమ్మ మృతి విషయం తెలుసుకుని ఆ గ్రామానికి కెళ్లి మృతురాలి కుటుంబాన్ని ఓదార్చారు. వారందరికీ ఆర్థికసాయం చేశారు. ఆయన వెంట మండల కన్వీనర్ శెట్టివారి జయచంద్ర, పిట్టా ఓబులరెడ్డి, మండల కార్యదర్శి పీట్ల సుధాకర్, మండోజీ ఆర్షిఖాన్, చికెన్ షానూ తదితరులు ఉన్నారు.

కంగారు పడకండి.. నేనే అభ్యర్థి

● అపోహలు వీడి ఎన్నికలకు సిద్ధం కండి

● టీడీపీ శ్రేణులకు కందికుంట వెంకటప్రసాద్ పిలుపు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కందికుంట

కదిరి, మార్చి 2: నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ఎవరనేదానిపై కార్యకర్తలు, నాయకులు, ప్రజలు ఎవరూ కంగారు పడాల్సిన అవసరం లేదని, వచ్చే ఎన్నికల్లో టీడీపీ తరఫున నేనే పోటీ చేయనున్నానని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ స్పష్టం చేశారు. పట్టణంలోని తన శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో కందికుంట వెంకటప్రసాదే అభ్యర్థిగా ఉంటారన్నారు. దీనిపై ఎవరూ ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దన్నారు. ఓ వర్గం నాయకులు, వైసీపీ నాయకులు ఏవేవో దుష్ప్రచారాలు చేస్తున్నారని, వాటిని నమ్మొద్దని తెలిపారు. అపోహలు వీడి ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు పవన్‌కుమార్‌రెడ్డి, మేడా శంకర్, డైమండ్ ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

రా... కదలిరా..కు తరలిరండి

పెనుకొండ సమీపంలోని కియ పరిశ్రమ వద్ద ఈనెల 4వ తేదీన టీడీపీ ఆధ్వర్యంలో రా.. కదలిరా... సభ జరగనుందని, కార్యక్రమానికి నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున తరలిరావాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ పిలుపునిచ్చారు. పట్టణంలో ఆయన మాట్లాడుతూ రా.. కదిలిరా సభకు చంద్రబాబు హాజరవుతున్నట్లు చెప్పారు. పార్టీ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొన్ని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

తనకల్లు: మండలకేంద్రంలోని అనంత మహిళా మండలి కుట్టు శిక్షణ కేంద్రంలో టీడీపీ మండల కన్వీనర్ రెడ్డిశేఖర్‌రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈనెల 4వ తేదీన పెనుకొండ కియ పరిశ్రమ వద్ద రా... కదలిరా... బహిరంగ సభ జరగనుందన్నారు. మండలంలోని నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సభకు వెళ్లేందుకు ఏర్పాట్లపై చర్చించారు. సమావేశంలో నాయకులు శంకర్‌నాయుడు, మహబూబ్ బాషా, సోంపాళ్యం నాగభూషణం, నాగేంద్రప్రసాద్, శ్రీధర్‌రెడ్డి, దస్తగిరి, సరోజమ్మ, తోటకిషోర్, మల్లికార్జున, దామోదర్, మాధవరెడ్డి, అమరనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక


టీడీపీలోకి చేరిన వారితో కందికుంట వెంకటప్రసాద్

నంబులపూలకుంట, మార్చి 2: మండలకేంద్రానికి చెందిన 20 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీతీర్థం పుచ్చుకున్నారు. కదిరి పట్టణంలోని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ నివాసంలో వారు పార్టీలోకి చేరారు. వారికి కందికుంట కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో కష్ట పడిన వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. చేరిన వారిలో ఖాదర్‌వలీ, అమానుల్లా, ముబారక్, బాబ్‌జాన్, రఘునాథరెడ్డి, చాంద్ బాషా, చిన్న ఆంజనేయులు, లోకేష్; షబ్బానా, మసూద్, వెంకటరమణ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పవన్‌కుమార్, దండే రవి, పాలగిరి బాషా, అజంతుల్లా, దండే గంగశేఖర్, రాహుల్‌బాబా, బీసీ సెల్ రవి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ధర్మవరం వాసి మృతి


రమేశ్ (ఫైల్)

తాడిమర్రి, మార్చి 2: మండలంలోని ఏకపాదంపల్లి గ్రామం వద్ద శనివారం రాత్రి 9 గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ధర్మవరం పట్టణం మారుతీనగర్‌కు చెందిన రమేశ్(40) మృతి చెందినట్టు ఎస్ఐ నాగస్వామి తెలిపారు. ఆయన తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. తాడిపత్రి వైపు నుంచి ధర్మవరానికి బైక్‌లో వస్తున్న రమేశ్ తాడిమర్రి మండలం ఏకపాదంపల్లివద్దకు రాగానే ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేస్తూ ఎదురుగా వచ్చిన కారును ఢీకొట్టాడు. దీంతో లారీ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తాము వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి వద్ద ఉన్న బ్యాంకు పాసుపుస్తకంలో ఉన్న ఆధారాలను బట్టిధర్మవరం వాసిగా గుర్తించామన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ వివరించారు.

పంటరుణాలు రెన్యూవల్ చేసుకోండి

ఓబుళదేవరచెరువు, మార్చి 2: రైతులు పంటరుణాలను సకాలంలో రెన్యూవల్ చేసుకోవాలని అల్లాపల్లి సహకార సంఘం చైర్మన్ శివారెడ్డి, సీఈఓ రామాంజనేయులు సూచించారు. మండలకేంద్రంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. సొసైటీ పరిధిలో పంటరుణాలు తీసుకున్న రైతులు ఈనెల 30వ తేదీ లోపు వడ్డీ చెల్లించి రుణాలు రెన్యూవల్ చేసుకోవాలన్నారు. సకాలంలో రెన్యూవల్ చేసుకుంటే ప్రభుత్వ రాయితీ వర్తిస్తుందన్నారు. రికార్డులన్నీ కంప్యూటరీకరణ చేస్తున్నారని, రైతులందరూ తప్పకుండా వన్‌బీ అండగల్, ఆధార్, రెండు ఫొటోలు అందించి, రుణాలు రెన్యూవల్ చేసుకోవాలని తెలిపారు.

మెడికల్ మాఫియాపై చర్యలు తీసుకోవాలి

ధర్మవరం, మార్చి 2: పట్టణంలో కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు మెడికల్ మాఫియాగా తయారవుతున్నాయని, వాటిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగుమధు డిమాండ్ చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతి రోజూ పట్టణంలోకి 30వేల మంది పలు రోగాల భారిన పడి ప్రైవేటు ఆస్పత్రులకు వస్తున్నారని, అయితే కొన్ని ఆస్పత్రుల యాజమాన్యం మెడికల్ మాఫియాగా తయారై ప్రతి చిన్నజబ్బుకి టెస్టింగ్, స్కానింగ్‌ల పేరుతో రోగుల జేబులకు చిల్లు పెడుతున్నారని ఆరోపించారు. వైద్యశాఖ జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో జరుగుతున్న మెడికల్ మాఫియాపై విచారణ చేపట్టాలని డిమాండ్‌చేశారు. సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శిరవి, సహాయకార్యదర్శి రమణ, చేనేత కార్మికసంఘం జిల్లా కార్యదర్శి వెంకటనారాయణ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ వయసు పెంచాలి

పుట్టపర్తి, మార్చి 2: డీఆర్‌డీఏ, ఐకేపీలో పనిచేస్తున్న సీసీల ఉద్యోగ విరమణ వయసును 63సంవత్సరాలకు పెంచాలంటూ ఎల్-1, ఎల్-2, ఎంఎస్‌టీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా నాయకులు అశ్వర్థరెడ్డి, మోహన్‌రెడ్డి, రవీంద్ర, శంకర డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అందరి ఉద్యోగులకు ఉద్యోగ విరమణ వయసును పెంచిందని, తమకు మాత్రం పెంచలేదని వాపోయారు. ఇప్పటికైనా ఉద్యోగ విరమణ వయసును పెంచాలని డిమాండ్ చేశారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు.

డ్వాక్రా సంఘాల ఏర్పాటు ఘనత చంద్రబాబుదే..


2వ వార్డులో భవిష్యత్తుకు గ్యారెంటీలో పాల్గొన్న పరిటాల జ్ఞాన


35వ వార్డులో కరపత్రాలు పంచుతున్న టీడీపీ నాయకులు

● భవిష్యత్తుకు గ్యారెంటీలో పరిటాల జ్ఞాన

ధర్మవరం, మార్చి 2: మహిళల ఆర్థికాభివృద్ధికి, అభ్యున్నతికి టీడీపీ అధినేత చంద్రబాబు ఎంతో కృషి చేశారని, డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ సతీమణి పరిటాల జ్ఞాన పేర్కొన్నారు. పట్టణంలోని 2వ వార్డులో శనివారం ఆమె బాబుష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డులో మహిళలు అడుగడుగునా ఘనస్వాగతం పలుకుతూ హారతులు పట్టారు. ఆమె ఇంటింటా తిరుగుతూ చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ పథకాల వల్ల ముఖ్యంగా మహిళలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. గతంలోనూ చంద్రబాబు మహిళల కోసం డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రం మళ్లీ అభివృద్ధి పథంలో పయనించాలంటే చంద్రబాబు సీఎం కావాలని అన్నారు. రాబోవు ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిగా, పరిటాల శ్రీరామ్‌ను ఎమ్మెల్యేగా గెలిపించుకుని రాష్ట్రాన్ని, ఇక్కడ ధర్మవరాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. ప్రస్తుతం సీఎం జగన్ పన్నుల రూపంలో ప్రజలను బాదేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో తెలుగుమహిళలు ముతుకూరుబీబీ, మాదన మహేశ్వరి, భీమనేని గీతావాణి, స్వర్ణకుమారి,మున్నీ, బాను, నాగరత్న, శారద,సునంద,మీనాక్షమ్మ, మాలతి, వసంత,ఇందిర, రమాదేవి,ప్యారీమా, వహీదా, కత్తులసునీత,నాగూర్‌బీ, షమీమ్, అశ్వర్థమ్మ, ఆదెమ్మ, నాయకులు పరిశేసుధాకర్, ఫణికుమార్, తలారి చంద్రమోహన్‌బాబు, నాగూర్‌హుస్సేన్, కేశగాళ్లశీన తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలోని 35వ వార్డులో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య, పట్టణ అధ్యక్షుడు పరిశేసుధాకర్ పట్టణ ప్రచార కమిటీ ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్‌పథకాల గురించి వివరించారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్రంలో సైకో పాలనతో ప్రజలు విసిగిపోయారన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌కు గుణపాఠం తప్పదన్నారు. కార్యక్రమంలో నాయకులు భీమనేని ప్రసాద్‌నాయుడు, జిలకర శీన,శీలామూర్తి, రాళ్లపల్లిషరీఫ్, అత్తార్‌రహీంబాషా, కరెంటు ఆది, మాదవ రెడ్డి, మారుతీస్వామి, తోట నారాయణస్వామి, అడ్రామహేశ్, బాబావలి, మున్ని, వహీద తదితరులు పాల్గొన్నారు.


బత్తలపల్లి మండలం సంజీవపురంలో ..

సంజీవపురం, యర్రాయపల్లిలో..

బత్తలపల్లి: మండలంలోని సంజీవపురం, యర్రాయపల్లి గ్రామాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు పంచుతూ సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. పథకాలు కుటుంబంలో ఎవరెవరికి వర్తిస్తాయి.. ఏ మేరకు లబ్ధి చేకూరుతుందో తెలియజేశారు. కార్యక్రమంలో తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షులు చల్లా శ్రీనివాసులు, నాయకులు గంటాపురం జగ్గు, సాంబ, మండల శ్రీనివాసులు, చితంబర్‌రెడ్డి, కిష్టయ్య, రవి, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల కోసం.. ఏం చేశావ్..?

● ఎస్టీ కమిషన్ సభ్యుడి నిలదీత

తనకల్లు, మార్చి 2: మండలంలోని పోమేనాయక్ తండాలో అధికారులు శనివారం ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభం కాగానే గ్రామానికి చెందిన జనార్ధన్‌నాయక్ మాట్లాడుతూ.. ఎస్టీ కమిషన్ సభ్యుడు అయిన మీరు గిరిజనులకోసం ఏమి చేశారని శంకర్‌నాయక్‌ను నిలదీశారు. గిరిజనులపై అక్రమంగా కేసులు పెట్టినా, రహదారులు, నీటి సౌకర్యం లేక గిరిజనుల అల్లాడిపోతున్నా పట్టించుకోలేదన్నారు. శ్మశానవాటిక లేక గిరి పుత్రులు ఆగచాట్లు పడుతున్నా ఏమీ స్పందించలేదని మండిపడ్డారు. గిరిజనులకు న్యాయం చేయనప్పుడు ఈ సమావేశాలు ఎందుకని ప్రశ్నించారు. దీంతో ఆగ్రహించిన ఎస్టీ కమిషన్ సభ్యుడు పోలీసులను ఉసిగొలిపి జనార్దన్‌నాయక్‌ను పక్కకు పంపించేశారు. సమావేశం నిర్వహిస్తున్నంతసేపు గిరిజనులు ఈ విషయం పైనే చర్చించుకున్నారు. మండలంలోని గేమే, పోమేనాయక్ తండాల వద్ద రోడ్డుసమస్యపై శంకర్‌నాయక్ స్పందించారు. గిరిజనులు, గిరిజ నేతరుల మధ్య నెలకున్న రోడ్డు సమస్యను పోలీస్, రెవెన్యూ అధికారులు సామరస్యంగా పరిష్కరించాలని సూచించారు. మండలంలోని వివిధ తండాల్లో నెలకొన్న రోడ్లు, తాగునీటి సమస్యల్ని పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ శోభాసువర్ణమ్మ, ఎంపీడీఓ పూల నరసింహులు, సీఐ వెంకటేశ్వర్లు, వివిధ శాఖలాధికారులు, గిరిజనసంఘాల నాయకులు గిరిజనులు, అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో ఎస్టీ కమిషన్ సభ్యుడిని నిలదీస్తున్న జనార్దన్ నాయక్

గిరిజన తండాల్లో మౌలిక వసతులు కల్పించండి

పుట్టపర్తి: జిల్లా వ్యాప్తంగా గిరిజన తండాల్లో మౌలిక వసతులు కల్పించాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు ఒడిత్యా శంకర్‌నాయక్ కలెక్టర్ అరుణ్‌బాబును కోరారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో ఆయన కలెక్టర్‌ను కలిసి సమస్యలను వివరించారు. ముదిగుబ్బ మండలం జొన్నకొత్తపల్లి తండాలో రోడ్డు సమస్య పరిష్కరించాలని, జిల్లా వ్యాప్తంగా తండాలలో తాగునీటిని అందించాలని, జలజీవన్ మిషన్ పథకం ద్వారా కొళాయిలను ఏర్పాటు చేయాలని, ఎస్టీ నిధులతో తండాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు.

రాఘవపల్లి వాసులకు ఓటుహక్కు కల్పించాలి

ముదిగుబ్బ, మార్చి2: మండలంలో వలసవెళ్లిన రాఘవపల్లి గ్రామస్థులందరికీ అధికారులు ఓటుహక్కు కల్పించాలని మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ వర్గీయులు కోరా రు. మండల కేంద్రంలో శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చిత్రావతి రిజర్వాయర్ ముంపునకు గురైన బూదనాంపల్లి పంచాయతీలోని రాఘవపల్లి గ్రామస్థులు బతుకుదెరువు కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారన్నారు. వారి ఆధారాలన్నీ రాఘవపల్లిలోనే ఉన్నాయని తెలిపారు. గ్రామంలో అన్ని ఆధారాలతో ఉన్న దాదాపు 80 మంది ఓట్లు తొలగించడం సరికాదన్నారు. స్థానికంగా ఉంటేనే ఓటుహక్కు కల్పిస్తామని, బీఎల్వోలు అంటున్నారని, బతుకుదెరువు కోసం వెళ్లినవారి ఓట్లు తొలగింపు సరైంది కాదని అన్నారు. వారి ఓటును తొలగించకుండా కొనసాగించాలని దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నారాయణస్వామి, దేవేందర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, రెడ్డెప్ప, లేపాక్షి, వాటర్ రవి, రామ్మోహన్, జయకృష్ణ, గుంజేపల్లి నారాయణస్వామి,లోకేష్, చలపతి, సురేష్‌రెడ్డి, మోపూరినాయుడు, పీసీరేవురామాంజి, మల్లయ్య, రాఘవేంద్ర, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాసవీ పాఠశాల వార్షికోత్సవం


నృత్యం చేస్తున్న చిన్నారులు

పుట్టపర్తి, మార్చి 2 : పట్టణంలోని శ్రీవాసవి పాఠశాల వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వాసవీ ఛత్రంలో ఈ వార్షికోత్సవ వేడుకలను జరిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేపట్టిన సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పలువురు చిన్నారులు తమ నృత్యాలతో అబ్బురపరిచారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, కోటా సత్యం, కరస్పాండెంట్‌లు సాగర్, ప్రవీణ్, వాసుదేవ్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్.. ముఫ్త్ బిజిలీని వినియోగించుకోండి

ధర్మవరం, మార్చి 2: కేంద్ర ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజలకు కరెంటు బిల్లుల భారం తగ్గించుకునేందుకు రాయితీతో సోలార్ ప్లాంట్‌ను ఇంటిపై కప్పు మీద ఏర్పాటుచేసే విధంగా పీఎం సూర్యఘర్‌ముఫ్త్‌బిజిలీ యోజన పథకాన్ని ప్రవేశపెట్టిందని, ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఈఈ గంగాధర్ సూచించారు. పట్టణంలోని విద్యుత్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రధాని మోదీ దేశవ్యాప్తంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఈ పథకం ద్వారా 0 నుంచి 150 యూనిట్లు వాడే విద్యుత్ గృహవినియోగదారులకు 1కిలో వాట్ సోలార్‌ప్లాంట్ ఏర్పాటు చేస్తారని, ఇందుకు సంబంధించి రూ.30వేల నుంచి రూ.60వేల వరకు సబ్సిడీ అందిస్తారని అన్నారు. అలాగే 150 నుంచి 300 యూనిట్లు వాడే వారికి 2లేదా 3 కిలో వాట్‌ల ప్లాంట్‌పైన రూ.60వేల నుండి 78వేల వరకు సబ్సిడీ, 300 యూనిట్‌లు పైగా వాడేవారికి 3కిలోల ప్లాంట్‌కు గాను రూ.78వేల దాకా సబ్సిడీని అందించనున్నట్లు చెప్పారు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాల్సిన వినియోగదారులు ww pm suryaghargov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమావేశంలో విద్యుత్‌శాఖ డీఈ లక్ష్మీనరసింహారెడ్డి, ఏఈలు పాల్గొన్నారు.

మామిడితోటలో అగ్నిప్రమాదం

● రూ.2.50లక్షల నష్టం


మామిడి తోటలో మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

ఓబుళదేవరచెరువు, మార్చి 2: మండలంలోని తొట్లివారిపల్లి సమీపంలో గంగాధర్‌రెడ్డి సాగుచేసిన మామిడి తోటలో శనివారం అగ్నిప్రమాదం జరిగింది. వెంటనే తోట యజమాని కదిరి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక ఎస్ఎఫ్ఓ మన్సూర్, ఎల్ఎఫ్ వెంకటరాముడు, సిబ్బంది సంఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే దాదాపు 30 శాతం పూత దశలో ఉన్న మామిడిచెట్లు దగ్ధమయ్యాయి. దీంతో రూ.2.50లక్షల మేర నష్టం జరిగిందని బాధిత రైతు ఆవేదన చెందారు. గుర్తు తెలియని వ్యక్తులు సమీపంలోని ఎండు గడ్డికి నిప్పు పెట్టారని, మంటలు తోటలోకి వ్యాపించి ప్రమాదం జరిగిందని అన్నారు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: పల్స్ పోలియో కార్యక్రమం ఆదివారం జరగనుండడంతో.. విజయవంతం చేయాలంటూ వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీలు చేపట్టారు. పుట్టపర్తి, కదిరి, ధర్మవరం నియోజకవర్గాల కేంద్రాలతో పాటు ప్రతి మండలకేంద్రంలోనూ శనివారం వారు పాఠశాలల విద్యార్థులతో కలిసి అవగాహనా ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ 0 నుంచి ఐదేళ్ల లోపు వయసున్న చిన్నారులందరినీ గుర్తించి 3వ తేదీన పోలియో బూత్‌లలో పల్స్ పోలియో చుక్కలు వేస్తామన్నారు. ఆ రోజున మిస్ అయిన చిన్నారులకు 4వ, 5వతేదీలలో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి చుక్కలు వేస్తారన్నారు. తల్లిదండ్రులు తప్పకుండా పిల్లలకు పల్స్‌పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ఆయా ప్రాంతాల్లో వీధుల గుండా ర్యాలీలు కొనసాగించారు. పలుచోట్ల ప్రధాన కూడళ్లలో మానవహారాలు ఏర్పాటు చేసి పోలియో లేని సమాజాన్ని నిర్మిద్దామని నినాదాలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో కార్యక్రమంలో వైద్యాధికారులు, వైద్యులతో పాటు సీహెచ్‌ఓలు సూపర్‌వైజర్లు, హెల్త్‌అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


కొత్తచెరువులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది,


ధర్మవరం మండలం గొట్లూరులో ..


బుక్కపట్నంలో..


ఓడీసీలో..


గాండ్లపెంటలో..

ఇంటర్ పరీక్షకు పదిమంది గైర్హాజరు

గోరంట్ల, మార్చి 2: పట్టణంలోని ఎస్‌పీఎస్ జూనియర్ కళాశాలలో రెండో సంవత్సరం ఇంటర్, తెలుగు పరీక్షకు పదిమంది విద్యార్థులు శనివారం గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ అడవాల సూర్యనారాయణ తెలిపారు. ఎస్‌పీఎస్, షిర్డిసాయి, ఎస్కేడీఆర్ జూనియర్ కళాశాలలు, ఖాజాపురం, కస్తూర్బా కళాశాలకు చెందిన మొత్తం 179మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 169మంది హాజరైనట్లు చెప్పారు.

అనారోగ్యంతో సెలవులో తహసీల్దార్

రొద్దం, మార్చి 2: మండలకేంద్రంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ లక్ష్మీనారాయణ అనారోగ్యం కారణంగా సెలవుపై వెళ్లినట్లు తెలిసింది. ఇటీవల విజయవాడలో ఎన్నికల శిక్షణ వెళ్లిన ఆయన తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో దీర్ఘకాలిక సెలవుపై వెళ్లినట్లు సమాచారం. ఆయన స్థానంలో రొద్దానికి ఎవరిని నియమిస్తారో చూడాలి.

వృత్తి మార్గదర్శనంపై శిక్షణ తరగతులు

రొళ్ల, మార్చి 2: మండలంలోని బీజీ హళ్లి జిల్లా ఉన్నత పాఠశాలలో బుధవారం 9, 10 తరగతుల విద్యార్థులకు వృత్తి మార్గదర్శనంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు యంజారప్ప మాట్లాడుతూ పదో తరగతి పాసైన తరువాత విద్యా, ఉద్యోగాలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి, ఫణి, విద్యార్థులు పాల్గొన్నారు.

మోడల్ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

అగళి, మార్చి 2 : మోడల్ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశానికి ఆదివారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని స్థానిక మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ జాఫర్ తెలిపారు. ఆన్‌లైన్‌లో ఈనెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఏప్రిల్ 21న అగళి మోడల్ పాఠశాలలో ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు ప్రవేశ పరీక్ష ఇంగ్లీష్, తెలుగులో ఉంటుందన్నారు. ఆరో తరగతిలో ఇంగ్లీష్ మీడియంలోనే బోధన ఉంటుందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేవారు ప్రవేశ పరీక్షకు ఓబీసీలు రూ.150, ఎస్సీ, ఎస్టీలు రూ.75 చెల్లించాల్సి ఉంటుందన్నారు. మెరిట్‌తోపాటు రిజర్వేషన్ ప్రకారం సీట్లు కేటాయిస్తారన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతి పొందిన పాఠశాల విద్యార్థులు అర్హులన్నారు.

'సాయి కాళేశ్వర్ ఆశయ సాధనకు కృషి'



విదేశీ వైద్యులతో ట్రస్టు చైర్‌పర్సన్ శిల్ప

పెనుకొండ, మార్చి 2 : ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త శివసాయి మందిరం వ్యవస్థాపకులు దివంగత డాక్టర్ సాయికాళేశ్వర్ ఆశయ సాధనకు తమవంతు కృషిచేస్తానని షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ శిల్ప పేర్కొన్నారు. స్థానిక శివసాయి మందిరంలో శనివారం గ్లోబల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని శిల్ప ప్రారంభించారు. శిబిరంలో చెవి, ముక్కు, గొంతు వ్యాధిగ్రస్తులకు ప్రముఖ విదేశీ వైద్యులు సుసానె, క్రిస్టియన్, రిచర్డ్, ప్రిజల్‌రోజ్, పీటర్, వైద్య పరీక్షలు నిర్వహించారు. 44మందికి వినికిడి యంత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకుడు విజయభాస్కర్‌రెడ్డి, చిట్టిబాబు, హరి, బాబు పాల్గొన్నారు.

నియామకం

హిందూపురం అర్బన్, మార్చి 2: తెలుగు బుక్ ఆఫ్ రికార్డు జిల్లా చీఫ్ కో ఆర్డినేటర్‌గా తనను నియమించినట్లు హిందూపురానికి చెందిన సాంప్రదాయ నృత్యకారిణి చంద్రబాను చతుర్వేది శనివారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. కళల ప్రోత్సాహానికి తన వంతు సహకారం అందిస్తానన్నారు.

కారును ఢీకొన్న బొలేరో వాహనం

ఒకరి మృతి, మరొకరికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

పెనుకొండ రూరల్, మార్చి 2 : మండలంలోని దుద్దేబండక్రాస్ సమీపంలో 44వ జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కారును బొలేరో వాహనం ఢీకొన్న ప్రమాదంలో నరసింహులు (42) అనే వ్యక్తి మృతిచెందాడు. కియ పోలీస్ స్టేషన్ ఎస్ఐ రంగడు తెలిపిన వివరాల మేరకు... హిందూపురం మోడల్ కాలనీకి చెందిన నరసింహులు, అతడి స్నేహితుడు రాజేష్ కలిసి బళ్లారికి వెళ్లి కారులో తిరిగి హిందూపురానికి వస్తున్నారు. కియ సమీపంలోని దుద్దేబండ క్రాస్‌వద్దకు శుక్రవారం అర్ధరాత్రి రాగానే పెనుకొండ నుంచి కియ వైపు వెళ్తున్న బొలేరోవాహనం డివైడర్‌ను ఢీకొని ఎడమవైపు నుంచి కుడివైపు వెళ్లి కారును ఢీ కొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నరసింహులు అక్కడికక్కడే మృతిచెందాడు. బొలేరో వాహన డ్రైవర్ చైతన్యకు స్వల్పగాయాలయ్యాయి. నరసింహులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

అడవిలో వృద్ధుడి మృతదేహం

చిలమత్తూరు, ఫిబ్రవరి 2: మండలంలోని డీ గొల్లపల్లి సమీపంలోని ఎర్రకొండ అటవీ ప్రాంతంలో ఒక వృద్ధుడి మృతదేహం శనివారం లభ్యమైంది. అటవీ ప్రాంతంలోకి పశువులను మేత కోసం తోలుకెళ్లిన పశువులకాపరులకు దుర్వాసన రావడంతో వారక్కడ వెళికారు. కుళ్లిపోయిన మృతదేహం అభ్యమైంది. వెంటనే డీ గొల్లపల్లి గ్రామస్థులకు సమాచారం అందించారు. అయితే మృతిచెందిన వృద్ధుడు డీ గొల్లపల్లికి చెందిన రామిరెడ్డి(78) అని, ఆయన 15 రోజులుగా కనపడకుండా పోయాడని ఆ గ్రామస్థులు తెలిపారు. విషయాన్ని రామిరెడ్డి కుటుంబ సభ్యులకు తెలుపడంతో ఆయన కుమారుడు రంగారెడ్డి మృతదేహాన్ని గుర్తించి తన తండ్రిదేనని నిర్ధారించుకున్నాడు. ఇటీవల ఆయన మతిస్థిమితం లేకపోవడంతో పాటు ఫిట్స్‌తో బాధపడుతున్నాడని, దీంతో ఇంట్లో నుంచి వెళ్లిపోయాడన్నారు. తాము చుట్టుపక్కల గ్రామాల్లో, బంధువుల ఊర్లలో వెతికినా అచూకీ తెలీలేదన్నారు. అటవీ ప్రాంతంలోకి వెళ్లి వెనక్కి రాలేక అక్కడే మృతి చెంది ఉంటాడని తెలిపారు. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా తమకు ఫిర్యాదు అందలేదన్నారు.



ప్రత్యేక అలంకరణలో వానవోలు కస్తూరి రంగనాథస్వామి



మడకశిరలోని కోట వెంకటేశ్వరస్వామి, చంద్రమౌళేశ్వరస్వామి, షిర్డీసాయిబాబా

ఘనంగా మాఘమాసం పూజలు

గోరంట్ల/ మడకశిర టౌన్/ గుడిబండ, మార్చి 2: గోరంట్ల మండలంలోని శివాలయాలు, అన్ని ప్రధాన ఆలయాల్లో మాఘవాస పూజలు శనివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు మాఘస్నానాలు ఆచరించి, ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. గోరంట్ల, వాన వోలు, బూదిలి, కరావులపల్లి తదితర గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వానవోలులోని కస్తూరి రంగనాథస్వామికి ఆకుపూజ చేశారు. అదేవిధంగా మడకశిర పట్టణంలోని కోటవెంకటేశ్వరస్వామి, మిట్టబండ ఆంజనేయస్వామి, అభయాంజనేయస్వామి, వీరభద్రేశ్వర, బోరామలింగేశ్వర, చంద్రమౌళేశ్వరస్వామి, షిర్డిసాయినాథుడు, మూలకంఠేశ్వరి, పూజమ్మదేవి తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెంకటేశ్వరస్వామికి ప్రాకారోత్సవం నిర్వహించారు. గుడిబండ మండలంలోని హిరేతుర్పి, కొంకల్లు, కురుబరపల్లి, డీటీపల్లిల్లో వెలసిన ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రా.. కదలిరా సభను విజయవంతం చేద్దాం

టీడీపీ నాయకులు



పెనుకొండలో మాట్లాడుతున్న బీకే పార్థసారథి

పెనుకొండ, మార్చి 2: మండలంలోని కియ పరిశ్రమ వద్ద సోమవారం టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారాచంద్రబాబు నాయుడు చేపట్టిన రా కదిలిరా బహిరంగసభకు నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలి వచ్చి విజయవంతం చేద్దామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి పిలుపునిచ్చారు. ఆయన శనివారం స్థానిక కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో చంద్రబాబు పార్యటనపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీకే మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు చేపట్టిన రా కదిలిరా కార్యక్రమం సోమవారం కియ పరిశ్రమవద్ద మధ్యాహ్నం 3గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెద్దఎత్తున కార్యకర్తలు తరలి వచ్చి విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా పరిశీలకుడు రవీంద్ర, నియోజకవర్గ పరిశీలకుడు నరసింహరావు, నాయకులు మునిమడుగు వెంకటరాముడు, కేశవయ్య, రొద్దం నరసింహులు, సుబ్బరత్నమ్మ, లక్ష్మీరెడ్డి, నాగరాజు, జావిద్, హుజూర్, నరహరి తదితరులు పాల్గొన్నారు.

మడకశిరటౌన్: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు రా కదలిరా సభను విజయవంతం చేయాలని టీడీపీ నియోజకవర్గం అభ్యర్థి సునీల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న పిలుపునిచ్చారు. వారు శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వైసీపీ అవినీతి, అక్రమ పాలనకు చరమగీతం పాడుదామన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రానికి రాజధాని, యువతకు ఉపాధి లభిస్తాయన్నారు. ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి, పరిశ్రమల స్థాపన, పేదలకు సంక్షేమ ఫలాల అందజేత నెరవేరుతాయన్నారు. అన్ని రకాల రాష్ట్రాభివృద్ధికి కృషి చేసే నేత చంద్రబాబు అన్నారు. నాయకులు, కార్యకర్తలు, టీడీపీ అభిమానులు పెద్ద ఎత్తున రాకదలిరా సభకు తరలివచ్చి చంద్రబాబుకు మద్దతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆది నారాయణ, రైతు ప్రధాన కార్యదర్శి ఉగ్ర నరసింహప్ప, మండల మాజీ కన్వీనర్ రామాంజనేయులు, నాయకులు, కెంచప్ప, కిష్టప్ప, నాగరాజు, మంజునాథ్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: టీడీపీ అధినేత చంద్రబాబు కియ పరిశ్రమ ఎదుట సోమవారం నిర్వహించే రా కదలిరా సభను విజయవంతం చేయాలని వక్కలిగ సాధికార కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు వీఎం పాండురంగప్ప, జిల్లా కార్యదర్శి రవిభూషణ్ కోరారు. వారు శనివారు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నియోజక వర్గం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు.



విలేకరులతో మాట్లాడుతున్న సునీల్‌కుమార్, ఈరన్న తదితరులు

చంద్రబాబు పర్యటన ఏర్పాట్లపై సమీక్ష

రొద్దం, మార్చి 2: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారాచంద్రబాబు నాయుడు సోమవారం పెనుకొండ నియోజకవర్గ పర్యటనకు వస్తున్న సందర్భంగా రొద్దంలో టీడీపీ నాయకులు ఏర్పాట్లపై సమీక్షించారు. రొద్దంలోని ఓ ఇంటివద్ద శనివారం వారు సమావేశమై, చంద్రబాబు పర్యటనపై చర్చించారు. ఏ గ్రామానికి ఏ వాహనం సమకూర్చాలన్న విషయంపై సమీక్షించారు. ప్రతి గ్రామానికి ఒక్కో వాహనం ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం 4గంటలకు పెనుకొండ కియ వద్ద చంద్రబాబు బహిరంగ సభ ఉంటుందన్నారు. మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని టీడీపీ నాయకులు మాధవనాయుడు కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరామిరెడ్డి, టైలర్ ఆంజనేయులు, పాతర్లపల్లి నరసింహులు, వీరాంజనేయులు, జయరాములు, లింగప్ప, చెన్నకేశవులు, హనుమంతరాయుడు, ఎం కొత్తపల్లి వీరప్ప తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కౌన్సిలర్‌పై చర్యలు తీసుకోండి

ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సత్యరామ్‌జీ

పెనుకొండ టౌన్, మార్చి 2: పట్టణంలో ఆర్యవైశ్య సంఘం చేపడుతున్న నిర్మాణాలను అడ్డుకుంటున్నా వైసీపీ కౌన్సిలర్‌పై చర్యలు తీసుకోవాలని ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సత్యరామ్‌జీ, గౌరవాధ్యక్షుడు జయంతి వెంకటేశ్వర్లు, నాయకులు పోతుల సురేష్ డిమాండ్ చేశారు. అన్ని అనుమతులతో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన నిర్మాణ పనులను ఇటీవల కొందరు పని కట్టుకుని మరి అడ్డుకుంటున్నారని వారు ఆరోపించారు. వైసీపీ కౌన్సిలర్ అడ్డుకున్న స్థలాన్ని శనివారం ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు, స్థానిక నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పట్టణంలోని తోటగేరి సమీపంలో 1933 సంవత్సరంలో నివసించిన చలిమయ్య అనే వ్యక్తికి చెందిన పదిసెంట్లలోని ఇల్లు, ఖాళీ స్థలాన్ని 1962లో ఆర్యవైశ్య సంఘం వారికి రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారన్నారు. సంఘం అభివృద్ధి కోసం ఆ స్థలంలో నిర్మాణ పనులు చేస్తుంటే పని కట్టుకుని వైసీపీ కౌన్సిలర్, మరో 15మంది గ్యాంగ్‌గా ఏర్పడి అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమన్నారు. ఇప్పటికైనా ఇలాంటివారిపై అధికారులు చర్యలు తీసుకోకపోతే ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు తరలి వచ్చి ఇక్కడ ధర్నాలు చేస్తామని హెచ్చరించారు.

నేడు టీడీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం

మడకశిరటౌన్, మార్చి 2: పట్టణంలోని చంద్రమౌళీశ్వరస్వామి ఆలయం వద్ద ఆదివారం ఉదయం 10 గంటలకు టీడీపీ నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ ఓబుశేశు, మాజీ సర్పంచులు మాధవరాజు తదితరులు తెలిపారు. టీడీపీ ప్రచార నేపథ్యంలో కార్యక్రమంపై చర్చించేందుకు అందరూ హాజరుకావాలన్నారు. తాము టీడీపీ విజయం కోసం శాయశక్తుల కృషి చేస్తామని, నాయకులు, కార్యకర్తల అభిప్రాయం మేరకు కార్యక్రమాన్ని రూ పొందిస్తామన్నారు.

పోలింగ్ బూత్‌లను పరిశీలించిన సబ్ కలెక్టర్

రొద్దం, మార్చి 2 : పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ శనివారం మండలంలోని కలిపి, చైటిరెడ్డిపల్లిల్లోని పోలింగ్ బూత్‌లను పరిశీలిం చారు. సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. చైటిరెడ్డిపల్లిలోని అంగనవాడీకేంద్రం చిన్నారులతో ముచ్చటించారు. ఆయన వెంట రెవెన్యూ రీసర్వే డీటీ చంద్రశేఖర్, సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, బీఎల్‌ఓలు ఉన్నారు.

'ఈత చెట్ల ఆక్రమణపై చర్యలు తీసుకోండి'

పెనుకొండ, మార్చి 2 : మండలంలోని చెర్లోపల్లిలో శోత్రియం భూముల్లో ఉన్న ఈతచెట్లను కొందరు అక్రమంగా గీసి సొమ్ము చేసుకుంటున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రైతు సంఘం, బహుజన చైతన్యవేదిక సభ్యులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. శనివారం రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇండ్ల ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు కాషీఫ్, బహుజన చైతన్యవేదిక అధ్యక్షుడు వెంకటేశ్ తదితరులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు.

'తూకాల్లో మోసం చేస్తే చర్యలు'

గుడిబండ, మార్చి 2 : చౌకధాన్య డిపోడీలర్లు, వ్యాపారులు తూకాల్లో మోసాలు చేస్తే చర్యలు తీసుకుంటామని లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ హెచ్చరించారు. మండలంలోని మోరుబాగల్, జీ మోరుబాగల్, అమరాపురం మండలం వలస, అగ్రహారం, అమరాపురం, హేమావతి, నిడ్రగట్ట, అగళి మదుడి తదితర గ్రామాల్లో శనివారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా నాలుగు కేసులు నమోదుచేసినట్లు ఆయన తెలిపారు. మోరుబాగల్ చౌకధాన్య డిపోలో తూకాల్లో వ్యత్యాసం ఉండటంతో కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

దేశానికి దిక్సూచి ఆర్యవైశ్యులు

జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రమాణ స్వీకారోత్సవంలో వక్తలు

హిందూపురం అర్బన్, మార్చి 2: దేశానికి దశ, దిశ, దిక్సూచి ఆర్యవైశ్యులే అని ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్నరామ సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు జయంతి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని వాసవీధర్మశాలలో శనివారం జిల్లా ఆర్యవైశ్య నూతన కమిటీ ప్రమాణస్వీకారోత్సవానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆర్యవైశ్యులు పోరాట పటిమ ఉన్నవారని, అధైర్య వంతులు కారన్నారు. దేశంకు ఆదాయ వనరులు ఆర్యవైశ్యుల వల్లే అన్నారు. వ్యాపారాల వల్ల దేశానికి సగం ఆదాయం వర్తకుల నుంచే వస్తుందన్నారు. ఆర్యవైశ్యులకు 5 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. ముఖ్యంగా ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలన్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా జేపీకే రాము, ప్రధాన కార్యదర్శిగా రవీంద్రుడు, కోశాధికారిగా శ్రీకాంత్, వర్కింగ్ అధ్యక్షుడిగా ప్రకాష్ మరి కొంత మంది కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. వారు మాట్లాడుతూ ఆర్యవైశ్యుల అభివృద్ధికి శక్తి వంచన లేకుండా పాటుపడుతామన్నారు. అంతకు ముందు ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం వాసవీ మాత ఆలయంలో నవగ్రహాల ఆలయానికి వెండి వాకిలి ఏర్పాటు చేశారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యుల నాయకులు పోతుల సురేష్, కోటా సత్యం తదితరులు హాజరయ్యారు.




ప్రత్యేక అలంకరణలో వాసవీమాత, జిల్లా అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేస్తున్న జేపీకే రాము

రెండు చుక్కలే అమృతం

పల్స్‌పోలియోపై అవగాహన ర్యాలీలో వైద్యులు

హిందూపురం అర్బన్, మార్చి 2: దేశ వ్యాప్తంగా ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని హిందూపురం పీపీ యూనిట్ వైద్యాధికారులు శ్రీనివాసరెడ్డి, ఆనంద్‌బాబు పేర్కొన్నారు. రెండు చుక్కలు అమృతంతో సమానమన్నారు. పట్టణంలో 55 బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్‌లో మొబైల్ వాహనంలో పోలియో చుక్కలు అందుబాటులో ఉంటాయన్నారు. అలాగే సోమ, మంగళవారాల్లో ప్రతి ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేస్తామని తెలిపారు.

గోరంట్ల: జాతీయ పల్స్ పోలియో నిర్మూలన కార్యాక్రమంపై వైద్య సిబ్బంది డాక్టర్ స్మృతి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. పోలియో నిర్మూలనకు ఆదివారం 47 కేంద్రాల్లో, ఐదు రూట్ల ద్వారా ఐదేళ్ల లోపు 4,510మంది చిన్నారులకు చుక్కలు వేస్తామని తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చిలమత్తూరు: పల్స్ పోలియో కార్యక్రమ నిర్వహణపై వైద్యాధికారి డాక్టర్ తేజశ్విని శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. వైద్యులు రామకృష్ణ, నిఖేష్, హర్షమిత్ర పాల్గొన్నారు. మండల వ్యాప్తంగా ఐదు వేల మంది పిల్లలకు చుక్కలు వేసేలా లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మొత్తంగా 9 రూట్లలో 84 బూత్‌లను ఏర్పాటుచేశామన్నారు. రెండు మొబైల్ టీంలు ఉంటాయన్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలియో చుక్కలు వేస్తామన్నారు. ముందుగా వారు మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. బస్టాండులో మానవహారంగా ఏర్పడి అవగాన కల్పించారు.



చిలమత్తూరులో మానవహారంగా ఏర్పడిన వైద్యసిబ్బంది

లేపాక్షి : మండలంలో ప్రతి చిన్నారికి పల్స్‌పోలియో చుక్కలు వేయించాలని ప్రభుత్వ వైద్యాధికారి వెంకట చిరంజీవి అన్నారు. మండల వ్యాప్తంగా 4367 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలన్నారు. పంచాయతీ కేంద్రాల్లో రెండు పోలింగ్ కేంద్రాలను ప్రతిగ్రామంలోనూ ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. వీటితోపాటు మొబైల్, బస్టాండు, దేవాలయం వద్ద అదనంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, అంగనవాడీలు, వైద్య సిబ్బంది పాల్గొంటారన్నారు.

శనీశ్వరస్వామికి వెండి పల్లకి ఉత్సవం



వెండిపల్లకిలో ఊరేగుతున్న శనీశ్వరస్వామి

పావగడ, మార్చి 2: జేష్టాదేవి సమేతుడైన పావగడ శనీశ్వరస్వామి వెండిపల్లకి ఉత్సవం శనివారం రాత్రి వైభవంగా జరిగింది. జ్యేష్టాదేవి సమేత స్వామి ఉత్సవ విగ్రహాలను రాత్రి 7.30 గంటలకు వెండి పల్లకిలో ఉంచి వందల సంఖ్యలో తరలివచ్చిన భక్తుల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు సాంబ్రాణి, అరటిపండ్లు విసిరి మొక్కులు తీర్చుకొన్నారు. అదేవిధంగా వందలాది మంది భక్తులు శనీశ్వరస్వామిని దర్శించుకుని, తైలాభిషేకం చేయించా రు. నవగ్రహ పూజల్లో పాల్గొన్నారు.

ఇంటిపై పార్టీ జెండా కట్టడం నేరమా?

సీఐపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం: మాజీ ఎంపీ నిమ్మల



సమావేశంలో మాట్లాడుతున్న నిమ్మలకిష్టప్ప

గోరంట్ల, మార్చి 2: వైసీపీ నాయకులు గ్రా మాల్లో ప్రచారానికి వెళ్లినప్పుడు ఇతర పార్టీల జెండా ఇళ్లపై ఉండడం నేరామా అని మాజీ ఎంపీ, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుల నిమ్మల కిష్టప్ప ప్రశ్నించారు. గోరంట్లలోని ఆయన నివాసంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. మండలంలోని జీన వాండ్లపల్లిలో టీడీపీ కార్యకర్త హనుమంతు ఇంటిపై పార్టీ జెండా ఉందని వైసీపీ నాయకులు పోలీసులతో కొట్టించడం ఏమిటన్నారు. ఏమి నేరం చేశారని ఇలా చేస్తారన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే సీఐ సుబ్బరాయుడు ఇలా ప్రవర్తిస్తుంటే ఎలాగన్నారు. ఇలాంటి అధికారులు ఉండకూడదని, వీరి వలన ఎన్నికలు ఏకపక్షంగా జరిగే అవకాశముందన్నారు. ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ప్రవర్తిస్తుండడంతో దీన్ని ఇంతటితో వదలేది లేదన్నారు. సీఐపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈసంఘటనపై వెంటనే అధికారులు విచారణ జరిపి చర్యలు చేపట్టాలన్నారు. ఇలాంటివి పునావృతం అయితే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతోపాటు, పార్టీ శ్రేణులతో కలిసి పోలీస్ స్టేషన్‌వద్ద ధర్నా నిర్వహించి, పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

చంద్రబాబు సభకు తరలిరండి

పెనుకొండ నియోజకవర్గంలోని కియ పరిశ్రమ వద్ద సోమవారం జరిగే చంద్రబాబునాయుడు బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ ఎంపీ నిమ్మలకిష్టప్ప ప్రజలను, పార్టీ శ్రేణులను కోరారు. వైసీపీ ఐదేళ్ల దుర్మార్గపు పాలనతో విసిగి వేసారిన ప్రజలు చంద్రబాబు సందేశం వినడానికి ఎంతో ఆసక్తి ఎదురు చూస్తున్నారన్నారు. రెండువందల వాహనాల్లో పదివేలమందిని గోరంట్ల నుంచి తీసుకెళ్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుబ్రహ్మణ్యం, నరేష్, బాలక్రిష్ణచౌదరి, కక్కల రఘునాథ్‌రెడ్డి, నిమ్మల శ్రీధర్, జనసేన నాయకులు సంతోష్, సురేష్, వెంకటేష్ తదితరులున్నారు.

గ్రాఫిక్స్ అనిన సైకోలకు ఇదే గుణపాఠం : టీడీపీ

పెనుకొండ టౌన్, మార్చి 2 : టీడీపీ పాలనలో చంద్రబాబు నాయుడు అంతా గ్రాఫిక్స్ అని అభివృద్ధి ఏ మాత్రం లేదని పదే పదే అనే సైకోలకు ఈ ప్రాంతానికి వచ్చి పరిశీలిస్తే కియా ఒక గుణపాఠంలా కనిపిస్తుందని జోన్ ఇన్‌చార్జ్ రవీంద్ర అన్నారు. శనివారం పెనుకొండలోని కియా పరిశ్రమ వద్ద ఈనెల 4న చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో జరిగే రా కదిలిరా సభ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ పనులను జోనల్ ఇన్‌చార్జ్ రవీంద్ర, పెనుకొండ నియోజకవర్గ పరిశీలకుడు నరసింహరావు, ఎమ్మెల్యే అభ్యర్థి సవిత, మాజీ ఎంపీ నిమ్మలకిష్టప్ప, అంబికా లక్ష్మీనారాయణలు పరిశీలించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి పరిపాలన అవినీతి అక్రమాలతో పేదవాని పొట్ట కొడుతుందన్నారు. అలాంటి దరిద్రపు సీఎంను తరిమికొట్టడానికి జనసేననేత పవన్ కల్యాణ్‌తో కలిసి రానున్న 2024 ఎన్నికల్లో ప్రభుత్వం ఏర్పాటుపై దిశనిర్దేశం చేయడానికి కియ ఎదురుగా ఉన్న గొప్ప సందేశం చంద్రబాబు ఇవ్వనున్నారన్నారు. లక్షల మందికి ఉపాధి చూపిన చంద్రబాబు సభ విజయవంతం చేయాలని సూచించారు.

పురాన్ని ఆధ్యాత్మిక కారిడార్‌గా తీర్చిదిద్దుతా

శ్రీపీఠం అధిపతి పరిపూర్ణానంద స్వామి



మాట్లాడుతున్న పరిపూర్ణానందస్వామి

హిందూపురం అర్బన్, మార్చి 2: దేశంలోనే ప్రత్యేక ఆధ్యాత్మిక కేంద్రంగా హిందూపురాన్ని తీర్చిదిద్దుతానని శ్రీపీఠం అధిపతి పరిపూర్ణానంద స్వామి పేర్కొన్నారు. ఆయన శనివారం స్థానిక వాసవీ విన్నర్స్ పాఠశాలలో విలేకరుల సమా వేశం ఏర్పాటు చేసి మా ట్లాడారు. నిరుద్యోగ సమస్యను రూపుమాపే దిశగా యువత అడుగులేయాలని జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. స్థానిక ఎస్‌డీజీఎస్ కళా శాలలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు పేర్ల నమోదు కార్యక్రమం ఉంటుందని, ఆ తరువాత ఎంపిక చేసుకున్న కంపెనీలతో ఇంటర్వ్యూలు ఉంటా యన్నారు. ఇప్పటికే కంపెనీల హెచ్‌ఆర్‌లు చేరుకున్నారన్నారు. దాదాపుగా 10 వేల రిజిస్ట్రేషన్‌లు కావచ్చారు. జాబ్‌మేళాకు వచ్చిన వారికి భోజన వసతి ఉంటుం దన్నారు. హిందూపురం ప్రాంతంలో పరిశ్రలు నెలకొల్పి, పర్యాటక కేంద్రంగా మార్చితే 50 వేల నుంచి 70 వేల కుటుంబాలకు ఉపాధి కలుగుతుందన్నారు. తాను సన్యాసినని, అయితే ఏదైనీ సాధించాలంటే చట్టసభల్లో మాట్లాడేందుకు సభ్యత్వం ఉండాలన్నారు. అంతేగానీ పదవులపై మోజు కాదన్నారు. గో సేవకు ముందుంటానన్నారు.

నిధుల దుర్వినియోగంపై పావగడ ఎమ్మెల్యే ఆగ్రహం



సామాన్య సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేశ్, ఏసీ శివప్ప తదితరులు

పావగడ, మార్చి 2: గతంలో ఉన్న మున్సిపల్ ముఖ్య అధికారి జగరెడ్డి హయాంలో పట్టణంలోని గుట్టహళ్లి, రైన్‌గేజ్, పాతూరులో ఏర్పాటు చేసిన మెర్క్యురీ డూం లైట్ల కోసం రూ.16లక్షలు డ్రా చేసి ఒక్క లైటు కూడా వేయలేదని ఏడోవార్డు సభ్యుడు బాలసుబ్రహ్మణ్యం చేసిన ఆరోపించా రు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్ ఆగ్ర హం వ్యక్తం చేశారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సామాన్య అధికారుల తీరుపై ఈసభలో ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే వెంకటరమణప్ప ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే ఈనిధులు దుర్వినియోగం చేసి నందుకు దానికి సంబంధించిన ఆధారాలతో రావాలని ఎమ్మెల్యే ఆదేశించారు. పట్టణంలో 10 నెలల నుంచి మున్సిపాలిటీకి రెగ్యులర్ ముఖ్యఅధికారి లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పలువురు సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకె ళ్లారు. ప్రస్తుతం ఉన్న అధికారులు లోకల్ రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మక్కై ఈ ఖాతాలు, ఎన్‌ఓసీలు ఇస్తున్నారని ఆరోపించారు. సామాన్యులకు పనులు జరగడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీ శివప్ప, ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం, మౌనంగా ఉండిపోవడం సభలో తీవ్ర చర్చకు దారితీసింది.